



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ మాధవీలత చిత్రంలో ఎస్పీ జేసీ



నన్నయ వర్శిటీ వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

4న ట్రాఫిక్ మళ్లింపు

- నన్నయ వర్శిటీలో ఓట్ల లెక్కింపు
- దివాన్‌చెరువు నుంచి రాకపోకలు నిషేధం
- బెజవాడ టూ విశాఖ వాహనాలకు బ్రేక్
- ఉదయం 4 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

రాజమహేంద్రవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4 (మంగళవారం)న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత, ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలుపుకోవాలన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు మంగళవారం ఉదయం 4గంటల నుంచి అమల్లో ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

- దివాన్ చెరువు సమీపంలోని జీరో పాయింట్ నుంచి రాజాగనరం దుర్గమ్మ గుడి జంక్షన్ మధ్య జాతీయ రహదారిపైకి ఎలాంటి వాహనాలకూ అనుమతి ఉండదు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలి.
- విజయవాడ వైపు నుంచి విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలను దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో 4వ తేదీ తెల్లవారు జామున 4 గంటల నుంచి తదుపరి అనుమతిచ్చే వరకూ నిలిపివేస్తారు.
- విశాఖపట్నం నుంచి చెన్నై వైపు వెళ్లే భారీ వాహనాలు కత్తిపూడి నుంచి పిఠాపురం, కాకినాడ,యానాం, అమలాపురం, మొగల్తూరు, అవనిగడ్డ, రేపల్లె, ఒంగోలు గుండా ప్రయాణించాలి. హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు రాజానగరం,కలవచర్ల జంక్షన్, ఏడీబీ రోడ్, కాకినాడ, ఎస్‌టీ రాజాపురం జంక్షన్,అనపర్తి కెనాల్ రోడ్, కడియం, రావులపాలెం గుండా వెళ్లాలి. హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లే కార్లు, 10 టైర్ల లారీలు,బస్సులు తదితర వాహనాలు నరేంద్రపురం జంక్షన్, నందరాడ, దోసకాయలపల్లి,ఎయిర్‌పోర్టు, కొంతమూరు గుండా ఎన్‌హెచ్ పైకి చేరుకొని యూటర్న్ తీసుకొని కొవ్వూరు మీదుగా ప్రయాణించాలి.
- రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్లే ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన వాహనాలు జీరోపాయింట్, కొంతమూరు, ఎయిర్‌పోర్టు, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నందరాడ, నరేంద్రపురం జంక్షన్ వద్ద ఎన్‌హెచ్-16పైకి చేరుకోవాలి.విశాఖ నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ వాహనాలు నరేంద్రపురం జంక్షన్, నందరాడ, దోసకాయలపల్లి, బూరుగుపూడి, ఎయిర్‌పోర్టు, కొంతమూరు, దివాన్‌చెరువు, జీరోపాయింట్ ద్వారా వెళ్లాలి.
- హైదరాబాద్, విజయవాడ వైపు నుంచి విశాఖ వెళ్లే వాహనాలు కొవ్వూరు మీదుగా కొంతమూరు వద్ద హైవేపై సర్వీసు రోడ్డు మీదుగా కిందికి దిగి ఎయిర్‌పోర్టు, బూరుగుపూడి, కోరుకొండ, గోకవరం, కొత్తపల్లి, మల్లిశాల, జగ్గంపేట వద్ద ఎన్‌హెచ్-16కి చేరుకోవాలి.
- రావులపాలెం వైపు నుంచి విశాఖ వెళ్లే వాహనాలు లాలాచెరువు, దివాన్ చెరువు,జీరో పాయింట్ వద్ద యూటర్న్ తీసుకొని కొంతమూరు వద్ద హైవే నుంచి సర్వీస్ రోడ్డుకు చేరుకొని ఎయిర్‌పోర్టు, కోరుకొండ, గోకవరం, కొత్తపల్లి, మల్లిశాల, జగ్గంపేట వద్ద ఎన్‌హెచ్-16 ఎక్కాలి.
- రాజమండ్రి నుంచి కాకినాడ వెళ్లే వాహనాలు వేమగిరి, కడియం, ద్వారపూడి గుండా..కాకినాడ నుంచి రాజమండ్రి వచ్చే వాహనాలు సామర్లకోట, బిక్కవోలు, కడియం, వేమగిరి గుండా ప్రయాణించాలి.

కౌంటింగ్ సిబ్బంది..ఏజెంట్లు పార్కింగ్ ఇక్కడే..

కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, పోటీ చేసిన అభ్యర్థులు, పోలీస్ అధికారులు, సిబ్బందికి పార్కింగ్ స్థలాలను కేటాయించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుస్తారు.

1.రాజమండ్రి వైపు నుంచి వచ్చే అన్ని రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు దివాన్‌చెరువు వద్ద ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా తూర్పు వైపున ఉన్న డీవీబీ రాజు ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.

2. రాజానగరం వైపు నుంచి వచ్చే ఏజెంట్లు రాజానగరం దుర్గమ్మగుడి జంక్షన్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలి.

3. రాజమండ్రి, రాజానగరం వైపు నుంచి వచ్చే కౌంటింగ్ ఆఫీసర్స్ సిబ్బంది, మీడియా గైట్ కళాశాల గ్రౌండ్‌లో వాహనాలు పార్క్ చేయాలి.

4. ఆర్‌వోలు,ఏఆర్‌వోలు,అభ్యర్థులు, చీఫ్ ఎలోన్ ఏజెంట్స్ వర్సిటీ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు పార్క్ చేసుకోవాలి.

5. పోలీస్ అధికారులు, ఇతర శాఖల వారు తమ వాహనాలను శ్రీ గణపతి సచ్చిదానంద గురుదత్త ఆశ్రమంలో ఖాళీ స్థలంలో నిలుపుకోవాలి. అక్కడి నుంచి మెయిన్ గేటు వద్దకు చేరుకోవాలి.

ఇతర నిబంధనలు..

1. గన్‌మ్యాన్‌లు అభ్యర్థులతో పాటు వచ్చి యూనివర్సిటీ గ్రౌండ్‌లో టెంట్‌లో కూర్చోవాలి.ఆయుధాలతో కౌంటింగ్ హాల్ వద్దకు వెళ్లకూడదు.

2. కౌంటింగ్ హాలులోకి సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థులు,అధికారులు సెల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, వాటర్ బాటిల్స్ లైటర్లు, సిగరెట్లు తీసుకెళ్లరాదు.

3. కౌంటింగ్ వద్ద డ్రోన్ కెమెరాలతో నిరంతరం గమనిస్తూ ఉంటారు.

విజయోత్సవ ర్యాలీలపై నిషేధం

- ప్రశాంత కౌంటింగ్‌కి పకడ్బందీ ఏర్పాట్లు
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరైనా జైలుకే
- కౌంటింగ్ ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ

రాజమహేంద్రవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేయడానికి పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.కౌంటింగ్ కేంద్రాలు, వివిధ ప్రాంతాల్లో శనివారం పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. 4వ తేదీన అనవసరంగా రోడ్లపై, వీధుల్లో తిరగడం చేయవద్దని సూచించారు.ఎన్నికల కేసుల్లో నమోదైతే జీవితం ఇబ్బందుల్లో పడుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాలు పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయన్నారు. జిల్లా మొత్తాన్నీ లైవ్ స్ట్రీమింగ్ డ్రోన్ కెమెరాలతో నిరంతరం గమనిస్తూ ఉంటామన్నారు. ఫలితాల తర్వాత విజయోత్సవ ర్యాలీలపై నిషేధం ఉందన్నారు. గొడవలు, విద్వేషాలు, అల్లర్లు సృష్టించడం, కవ్వింపు చర్యలకు దిగడం వంటివి చేస్తే వెంటనే అరెస్టు చేస్తామన్నారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా ఆల్కహాల్ టెస్టింగ్ చేసి మద్యం తాగినట్లు తేలితే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.జిల్లాలో సీఆర్పీసీ 144, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో పోలీసులకు సహకరించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులుంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించడం తమ బాధ్యతగా భావించాలన్నారు.

ఆ నలుగురే.. కౌంటింగ్ పరిశీలకులు

7



కూటమికే.. జైకొట్టారు!

ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో విరిగిన ఫ్యాన్ రెక్కలు

- తూర్పున క్లీన్ స్వీప్ - ఫైచేయి సాధించిన కూటమి
- 7 అసెంబ్లీ, పార్లమెంట్ స్థానంలోనూ గెలుపు
- రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం వస్తున్నట్టు తేల్చివేత
- ఎగ్జిట్ పోల్ ఫలితాలతో కూటమిలో మరింతగా జోష్
- వైసీపీ ఓటమి ఖాయమని తేలడంతో అభ్యర్థుల్లో డీలా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమిదే పైచేయిగా తేలింది. భారీ సీట్ల ఆధిక్యతతో అధికారంలోకి రాబోతున్నట్టు సుస్పష్టమైంది. అధికార వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతున్నట్టు శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్‌పోల్ ఫలితాలు తేటతెల్లం చేశాయి. 8 సంస్థలు సర్వే చేయగా 5 టీడీపీ కూటమికే పట్టం కట్టాయి. భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వం రాబోతున్నట్టు తేల్చి చెప్పాయి. జిల్లాలో ఏడుకు ఏడు సీట్లు టీడీపీ, జనసేన, బీజేపీ గెల్చుకోబోతున్నట్టు స్పష్టం చేశాయి. ఒక రకంగా చెప్పాలంటే మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో జిల్లాలో టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ ఖాయమని పేర్కొన్నాయి. గత నెల 13న జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి బట్టి టీడీపీ,జనసేన, బీజేపీ భారీగా విజయం సాధించబోతున్నట్టు భారీ విశ్లేషణలు వ్యక్తమయ్యాయి. అధికార వైసీపీ అరాచకాలు,ప్రజావ్యతిరేక నిర్ణయాలతో విసుగెత్తిన ఓటర్లు ఆ పార్టీని ఓటుతో చాచికొట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం గెలుపు ఖాయం అని ప్రతి ఒక్కరి నోటా అభిప్రాయం వ్యక్తమైంది.దీనికి తగ్గట్లుగానే ఎగ్జిట్‌పోల్ సర్వే ఫలితాలు కూటమిదే విజయమని తేల్చేశాయి. దీంతో సంబరాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమిలో జోష్..

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూటమిలో జోష్‌ను పెంచాయి. సుమారు 8 సంస్థలు చేసిన సర్వే ఐదు సంస్థలు కూటమికే అధికారాన్ని ఇచ్చాయి. జాతీయ స్థాయిలో చేసిన సర్వేలలో కూడా ఎక్కువ ఎంపీ స్థానాలు కూటమికే వస్తాయని చెప్పడం గమనార్హం. జిల్లాలో రాజమహేంద్ర వరం ఎంపీ స్థానంతో పాటు, ఏడు అసెంబ్లీ స్థానాలు కూటమికే వస్తాయని అంచనా వేస్తున్నారు.ఒకటి రెండు చోట్ల ఫైట్ ఉందని చెబుతున్న ప్పటికీ పోలింగ్ రోజు నుంచి ఇప్పటి వరకూ జనం నోట వినిపిస్తున్న మాట ప్రకారం కూటమికే అవకాశాలు ఉన్నాయి.సైలెంట్ వేవ్‌తో కూటమి అభ్యర్థులు గెలవనున్నారని, ఓట్లేసిన వారిలో ఎక్కువ మంది చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న సంగతి తెలిసిందే. దానికి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో వివిధ వర్గాల ప్రజలు వైసీపీకి దూరమయ్యాయి. కేవలం సంక్షేమ పథకాల పేరిట ఓట్లు వేసి ఉంటారనే భ్రమలోనే అధికార పార్టీ ఉంది. వాస్తవానికి జిల్లాలో పోటీ చేసిన వైసీపీ అభ్యర్థులు ప్రచారంలో చెమటలు కక్కారు. సామాజిక వర్గాల్లో విభజన ద్వారా కొంతమేరైనా ఓట్లు తెచ్చుకోవాలని తెగతంటాలు పడ్డారు. డబ్బు కూడా ఖర్చు చేశారు. కానీ గత నెల 13న జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఓటర్లంతా ఎక్కువగా కూటమి వైపే ఉన్నట్టు తేలింది. టీడీపీ,జనసేన, బీజేపీ కలవడంతో వారి బలంగా బాగా పెరిగింది. అంతేకాదు ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చింది. అదే ఫలితాలు ఇస్తుంది.

రెండు రోజుల్లో ఫలితం

ఈనెల 4వ తేదీన కౌంటింగ్. ఇక మధ్యలో రెండు రోజులు మాత్రమే ఉంది. ఆదివారం, సోమవారం గడిస్తే మంగళవారం ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ఆరంభిస్తారు. 12 గంటలలోపే ఫలితం తేలిపోతోంది. జిల్లాలో 80.93 శాతంగా పోలింగ్ నమోదైంది. అత్యధికంగా రాజానగరం నియోజకవర్గంలో 87.54 శాతం నమోదు కాగా అత్యల్పంగా రాజమహేం ద్రవరం సిటీలో 67.57 శాతం నమోదైంది. ఇక గోపాలపురంలో 86.67 శాతం,అనపర్తిలో 86.23 శాతం, కొవ్వూరులో 85.90 శాతం, నిడదవోలులో 84.67 శాతం. రాజమహేంద్రవరం రూరల్‌లో 73.02 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా 13,13,645 మంది ఓటు హక్కు వినియోగించుకు న్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేయగా, వైసీపీ ఒంటరిగాపోటీ చేసింది. కాంగ్రెస్, వామపక్షాలు కూటమిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే.ఇలా మొత్తం 83 మంది అభ్యర్థులు పోటీపడగా అందులో 59మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.అయితే ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.స్వతంత్రులు ఎక్కడా కనబడలేదు.

అటు సంబరాలు..ఇటు డీలా..

ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో జిల్లా టీడీపీలో సంబరాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నేళ్ల పోరాటం ఫలించిందంటూ ఆనందపడుతున్నాయి. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తుందని తేలడంతో నేతలు,కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. తామేదైతే విశ్లేషించుకున్నామో ఎగ్జిట్‌పోల్ ఫలితాలు కూడా అలాగే రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలోను భారీ సీట్లు టీడీపీ కూటమి దక్కించుకుంటుందని ఎగ్జిట్‌పోల్ ఫలితాల్లో తేలడంతో వైసీపీ అరాచక పాలనకు ప్రజలంతా బుద్ధిచెప్పినట్లయిందని పేర్కొంటున్నారు.టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి జిల్లాలోను, రాష్ట్రంలోను ప్రభంజనం సృష్టిస్తుందన్న అంచనాలు నిజమయ్యాయని నియోజకవర్గ అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నొక్కిన ఉత్తుత్తి బటన్‌లను ప్రజలు నమ్మలేదని, ముఖ్యంగా మహిళలు వైసీపీకి బుద్ధి చెప్పారని వివరిస్తున్నారు. టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో కూటమికి ఓట్లు భారీగా రాల్చిందని చెబుతున్నారు. ఎగ్జిట్‌పోల్ ఫలితాల అనంతరం ఆయా పార్టీల నేతలు,కార్యకర్తలు ఫోన్లు చేసుకుని సంతోషం పంచుకున్నారు. అటు అధికారపార్టీ నేతలను ఎగ్జిట్‌పోల్ ఫలితాలు తీవ్ర నిరాశలో ముంచేశాయి. వైసీపీ గద్దె దిగడం ఖాయమని తేలిపోవడంతో జిల్లాలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీలా పడిపోయారు. రాష్ట్రంలో ఒక్క సీటు కూడా వచ్చే ఛాన్స్ లేదని తేలడంతో రాజకీయ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.



పోలీస్..దందా!

అడిగింది ఇచ్చుకో.. నచ్చింది చేసుకో..

- ఎన్నికల విధుల్లో ఎస్పీ బిజీబిజీ
- కొందరు మాత్రం అలసత్వం
- ఎన్నికల విధుల పేరుతో దోపిడీ
- ఒక డీఎస్పీపై తీవ్ర ఆరోపణలు
- సీఐ, ఎస్ఐలతో సొంత పనులు
- ఇటీవలె హెచ్చరించిన ఎస్పీ?
- అయినా మారని తీరు
- పట్టుతప్పుతున్న ఖాకీలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ జగదీశ్‌తో సహా జిల్లాలోని ఖాకీ యూనిఫాంలకు నిమిషం విశ్రాంతి దొరకడం లేదు.కౌంటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ హైరానా పడుతున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తు బందోబస్తులో మునిగిపోయారు.అల్లర్లు సృష్టిస్తే జైలుకు పంపిస్తామని ఐజీ అశోక్ కుమార్, పోలీస్ ఇమేజ్‌ని మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని డీజీపీ(శాంతి భద్రతలు) శంఖబ్రత బాగ్చి ఇటు ప్రజలకు అటు సిబ్బందికి స్పష్టం చేశారు. జిల్లాలో అల్లర్ల మాట ఎలా ఉన్నా.. ఇంటి దొంగల పని పట్టకపోతే మాత్రం కష్టమేననే చర్చ నడుస్తోంది. ఖాకీల్లోని కొందరి అలసత్వ తీరు, వారిని ఉన్నతాధికారులు హెచ్చరించి వదిలేయడం విమర్శలకు తావిస్తోంది.అసాంఘిక వ్యక్తులతో అంటకాగడం,అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా వ్యవహరించడం వంటివి కష్టపడి పనిచేసే సిబ్బంది, అధికారులను ఆవేదనకు గురిచేస్తు న్నాయి. ఎన్నికల బందోబస్తులో జిల్లా పోలీసులు తీరిక లేకుండా ఉండగా ఓ డీఎస్పీ మాత్రం 'సొంత' పనులు పురమాయిస్తూ ఇబ్బంది పెడు తున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలోని మరో డీఎస్పీ తీరుపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. అయినా ఆయన ఎన్నికల విధుల్లో కొనసాగుతూనే ఉన్నారు.

సబ్ డివిజనల్ అధికారిపై విమర్శలు

జిల్లాలోని ఓ సబ్-డివిజనల్ అధికారి ఇటీవల ఎన్నికల కోటాలో బదిలీపై వచ్చారు. ఆయనపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వచ్చీ రావడంతోనే ఎన్నికల ప్రొటోకాల్‌ని తన సొంత ప్రొటోకాల్‌గా మార్చేసుకొని అక్రమ ఆదాయంపై దృష్టి సారించారనే ఆరోపణలు ఆ శాఖ అధికారుల నుంచి వినిపిస్తున్నాయి. తన కార్యాల యంలో ఏళ్లకు తరబడి పాతుకుపోయిన మరో చిరు అధికారి సహకారంతో ఇతర అధికారులపై జులుం ప్రదర్శిస్తున్నారని సమాచారం. ఎన్నికల విధుల్లో ఎస్పీ తదితర అధికారులు, సిబ్బంది ఉంటే..ఆ అధికారి మాత్రం సీఐలు, ఎస్ఐలను తన సొంత వ్యాపకాలకు వాడుకుంటున్నారని వాపోతున్నారు. ఇటీవల సబ్-డివిజన్ పరిధిలోని ఓ గ్రామంలో జాతర జరుగుతున్న సందర్భంలో కోడి పందేలు,పేకాట శిబిరాలకు అవినీతి మాటున అనుమతిచ్చారని తెలిసింది. ఈ విషయం ఎస్పీకి తెలియడంతో ఆ అధికారిని తీవ్రంగా మందలించారేగానీ..తదుపరి చర్యలు తీసుకోలేదని చర్చ నడుస్తోంది. మరో మండలంలోని ఓ గ్రామంలో జరుగుతున్న జాతరకు కోడి పందేలకు, పేకాటలను చూసీచూడకుండా వదిలేయడానికి తనకు పెద్ద మొత్తంలో డబ్బు కావాలంటూ ఆ జూదం నిర్వహించే వైసీపీ నాయకుడి గెస్టహౌస్‌కి వెళ్లి బేరసారాలు సాగించడం వివాదాలకు తావిస్తోంది. ఇలా తనకు లంచం ముట్టిన ప్రాంతాల్లో ఎలాంటి తనిఖీలు చేయవద్దని, నోరుమూసుకొని కూర్చోవాలని ఆయా పరిధుల్లోని అధికారులను ఆయన బెదిరిస్తున్నట్టు సమాచారం. అనుకూలంగా ప్రవర్తించకపోతే పాత కేసులను తిరగతోడి చార్జిమెమోలను జారీచేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కిందిస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆ అధికారి ఆయన కార్యా లయంలోనే నివాసం ఉండే అవకాశం ఉన్నా ప్రత్యేకంగా ఓ ప్రైవేటు ఇంటిలో ఉంటూ గ్యాంబ్లర్స్‌తో లావాదేవీలు చేస్తున్నారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోనే పేరు పొందిన ఓ గ్యాంబ్లర్ ఆ అధికారికి కుడిచేతిగా వ్యవహరిస్తూ సెటిల్‌మెంట్లలో కీలక మధ్యవర్తిగా ప్రవర్తిస్తు న్నాడని వినవస్తోంది.ఆయన తీరుతో కింది స్థాయి అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పోలీస్ సిబ్బంది, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందిపై నిఘా విభాగం ఆరా తీసి ఎస్పీకి సమర్పించడం, దానిపై ఆయన చర్యలు తీసుకోవడం తక్షణ అవసరం. సొంత పనులకు ప్రాధాన్యం ఇచ్చేవారిని ఎన్నికల విధుల నుంచి తప్పించడం శ్రేయస్కరం.

వైసీపీ పోస్టుకు కానిస్టేబుల్ కామెంట్..

పోలింగ్ రోజున దొమ్మేరులో చెలరేగిన అల్లర్లను అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారు.ఇప్పటికీ వైసీపీ నాయకులంటే భయం వారిలో కనిపిస్తోంది. పోలీసు అబ్జర్వర్ ఘటనా ప్రదేశానికి వెళ్లినా ఫలితం లేకపోయింది. కొవ్వూరు రూరల్ పీఎస్‌లోని ఓ కానిస్టేబుల్ చేసిన పనిపై రగడ రేగుతోంది. వైసీపీకి అనుకూలంగా వచ్చిన పోస్టుకు 'బాగా విశ్లేషించారండీ' అంటూ కామెంట్ పెట్టడం వివాదానికి తావిస్తోంది.

ఇద్దరు కౌంటింగ్ ఏజెంట్లకు క్రిమినల్ కేసులు?

కౌంటింగ్ ఏజెంట్ల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇప్ప టికే సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలతో వైసీపీ ఏజెంట్లు రెచ్చిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం కౌంటింగ్ ఏజెంట్లుగా నమోదు చేసుకున్న ఇద్దరు వైసీపీకి చెందిన వారిపై కేసులు ఉన్నాయని చెబుతున్నారు. కౌంటింగ్ సిబ్బంది విషయంలోనూ జాగ్రత్తలు అవసరం.70 కార్డన్ సెర్చ్‌లు చేశామని ఎస్పీ చెబుతున్నా.. లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, ఫాంహౌస్‌లు, అపార్ట్‌మెంట్లలో అపరిచిత వ్యక్తుల గురించి సోదాలు మాత్రం జరగలేదు. మరో రెండు రోజుల్లో కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా టెన్షన్ నెలకొంది.

ఎల్లుండే కౌంటింగ్

- 4న ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్
- సమాంతరంగా ఈవీఎంలు, బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నం 2 గంటలకే లెక్కింపు ముగింపు
- కొవ్వూరు ఫలితం 12.40 గంటలకే వెల్లడి
- చివరిలో రాజమహేంద్రవరం రూరల్ ఫలితం
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం,జూన్1(ఆంధ్రజ్యోతి) : ఓట్ల లెక్కింపు ఎల్లుండి మంగళవారం ఉదయం 8 గంటల నుంచే ఆరంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్వో నరసింహులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్లను ఒకేసారి సమాంతరంగా లెక్కిస్తారని, ప్రతి రౌండ్ పూర్తికాగానే, వాటి వివరాలు మీడియాకు అందిస్తామన్నారు. నన్నయ వర్సిటీలోని కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించే సిబ్బందికి ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డులు జారీ చేసిందన్నారు. కేంద్రంలోకి ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ఒక ఏజెంట్ ఒకసారి లోపలకు వచ్చి తిరిగి బయటకు వెళితే తిరిగి అనుమతించమన్నారు. నియో జకవర్గాల వారీగా కలర్‌కోడ్‌ను గుర్తింపుగా ఇచ్చామన్నారు. ఇతరులకు ప్రవేశం లేదన్నారు.కౌంటింగ్ ఏజెంట్లు వారికి కేటాయించిన నియోజకవర్గం కౌంటింగ్ హాల్ నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకూ బయటకు వెళ్లే వీలులేదన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 98 టేబుళ్లు, మొత్తం 116 రౌండ్లు, అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 98 టేబుళ్లు, 116 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపునకు సహాయ రిటర్నింగ్ అధికారులు ఏడుగురు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు 119 మంది, సహాయకులు 126, సూక్ష్మ పరిశీలకులు 140, ఇతర సిబ్బంది 119 వంతున నియమించినట్టు చెప్పారు. మొత్తం 2500 మంది కౌంటింగ్ సిబ్బంది ఉంటారన్నారు. మొత్తం 17 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఇందులో 7 అసెంబ్లీ, 7 సెంటర్లలో పార్లమెంట్, 3 సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారన్నారు. రాజమండ్రి సిటీ, రూరల్‌లో ఎక్కువ పోస్టల్ బ్యాలెట్లు ఉన్నందున ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, అనంతరం ఈవీఎం ఓట్లు లెక్కిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఒక రౌండ్‌లో లెక్కించడానికి 3గంటలు సమయం పడుతుందన్నారు. కొవ్వూరు ఫలితం మధ్యాహ్నం 12.40 గంటలకు, రాజమండ్రి రూరల్ ఫలితం 2 గంటలకు ప్రకటించే విధంగా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. మీడియాను మీడియాసెంటర్ వరకే అనుమతి ఇస్తామని అక్కడ వరకూ సెల్‌ఫోన్లు తెచ్చుకోవచ్చన్నారు. కౌంటింగ్ హాల్‌లోకి ఎవరూ ఫోన్‌లు తీసుకురాకూడదని..ముందుగానే అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్‌లో డిపాజిట్ చేయాలన్నారు. మొత్తం లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటలకు పూర్తవుతుందని తెలిపారు. కానీ గెలిచిన వారికి వీవీప్యాట్స్ ఓట్ల లెక్కింపు, సర్టిఫికెట్లు ఇవ్వడం వంటి మొత్తం ప్రక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసేలా కార్యాచరణ చేశామన్నారు.ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు తెల్లవారుజాము నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామన్నారు. కౌంటింగ్ సెంటర్‌కు 2 కిలోమీటర్ల పరిధి వరకూ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. 130 సీసీ కెమెరాలు, 10 డ్రోన్ల పర్యవేక్షణ ఉందని చెప్పారు. జిల్లాలో 160 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలకు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. అభ్యర్థుల ఇళ్ల వద్దకు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఏ నియోజకవర్గం లెక్కింపు ఎక్కడంటే..

రూట్ మ్యాప్ సిద్ధం చేసిన అధికారులు



దివాన్‌చెరువు, జూన్ 1 : లెక్కింపు ఎక్కడ జరుగుతుంది.. ఎలా వెళ్లాలి .. ఏ భవనంలో జరుగుతుందనే దానిపై ఒక రూమ్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం సమీపంలో లెక్కింపు కేంద్రాల సమాచారంతో రూపొందించిన పెద్ద స్కెచ్ బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. అందులో నియోజకవర్గాల పేర్లు, లెక్కింపు జరిగే భవనం తదితర సమాచారం పొందు పరచారు. నిడదవోలు నియోజకవర్గం ఓట్లు లెక్కింపు ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం గ్రౌండ్‌ఫ్లోర్, గోపాలపురం నియోజకవర్గం ఓట్లులెక్కింపు ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం మొదటిఫ్లోర్‌లోనూ జరుగుతాయని పేర్కొన్నారు. రాజానగరం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఇంజనీరింగ్ వర్క్‌షాప్ ల్యాబ్స్, ఎస్.బ్లాకులో రాజమహేంద్రవరం రూరల్,అనపర్తి, కొవ్వూరు, రాజమండ్రిఅర్బన్ నియోజకవర్గాల ఓట్లు లెక్కిస్తారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పరిపాలనా భవనం రెండో ఫ్లోర్‌లో లెక్కిస్తారు. పరిపాలనా భవనానికి ఎదురుగా గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో మీడియా సెంటర్ , కమాండ్ కంట్రోల్‌రూమ్‌లు పనిచేస్తాయని పేర్కొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ పద్మశ్రీ రాణి



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 1 : జిల్లా వైద్యసేవల సమన్వయాధికారిణి (డీసీహెచ్ఎస్)గా నియమితులైన డాక్టర్ ఎస్‌పీ పద్మశ్రీ రాణి శనివారం కలెక్టర్ మాధవీలతను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇప్పటి వరకూ డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన సనత్‌కుమారి పదవీవిరమణ చేయడంతో పద్మశ్రీ రాణిని ఎఫ్ఏసీగా నియమించారు. డాక్టర్ పద్మశ్రీ రాణి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి జిల్లాకు బదిలీపై వచ్చారు. అంతకుముందు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోనూ పద్మశ్రీ రాణి విధులు నిర్వర్తించారు.

కాలువలకు నీరు విడుదల



గోదావరి నుంచి శనివారం ఉదయం కాలువలకు సాగు నీటిని విడుదల చేశారు. ఈ మేరకు కలెక్టర్ మాధవీలత గోదావరికి చీర, పసుపు కుంకుమ వేసి పూజలు చేశారు. - వివరాలు 7లో

మునిసిపల్ ఆర్డీగా

నాగ నరసింహరావు బాధ్యతల స్వీకరణ




బాధ్యతలు స్వీకరిస్తున్న సీహెచ్ నాగ నరసింహరావు

రాజమహేంద్రవరం సిటీ/కార్పొరేషన్(కాకినాడ), జూన్ 1 : రాజమహేంద్రవరం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్‌గా సీహెచ్. నాగనరసింహరావు నియమితులయ్యారు. మునిసిపల్ ఆర్డీగా పనిచేసిన నాగళ్ళ వీర వెంకట సత్యనారాయణ పదవీ విరమణ కావడంతో ఆయన స్థానంలో కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్.నాగనరసింహరావును ఆర్డీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్డీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 1999 గ్రూప్-2 బ్యాచ్‌కు చెందిన నాగ నరసింహరావు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో భీమవరం, పాలకొల్లు, కొవ్వూరు, నరసాపురం మునిసిపాలిటీలకు కమిషనర్‌గా సేవలందించారు. కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆర్డీ నాగనరసింహరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్డీగా అంకితభావంతో సేవలందిస్తానన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో 34 మునిసిపాలిటీలు తన పరిధిలో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలు మునిసిపాలిటీలకు చెందిన కమిషనర్లు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఏపీ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఏసుబాబు, సిబ్బంది అభినందించారు.

కాలువలకు జలకళ..



ధవళేశ్వరం వద్ద స్విచ్ఛాన్ చేసి నీటిని విడుదల చేస్తున్న కలెక్టర్ మాధవీలత



ధవళేశ్వరం వద్ద గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు

- డెల్టా కాలువలకు సాగునీరు విడుదల
- మూడు కాలువలకు 3 వేల క్యూసెక్కులు విడుదల
- 'తూర్పు' కలెక్టర్ మాధవీలత పూజలు

ధవళేశ్వరం, జూన్ 1: రైతులు సకాలంలో నాట్లు పూర్తి చేసుకుంటే పంట ప్రకృతి విపత్తుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అందుకే జూన్ 1న సాగునీటిని విడుదల చేస్తున్నామని కలెక్టర్ మాధవీలత అన్నారు. గోదావరి డెల్టా పరిధిలోని మూడు ప్రధాన పంట కాల్వలకు శనివారం సాగునీరు విడుదల చేశారు. ఉదయం తూర్పుడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద ఆమె గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలు సమర్పించారు. స్లూయిజ్‌గేట్లు ఎత్తి మోటార్ స్విచ్ ఆన్‌చేసి తూర్పుడెల్టా కాలువకు నీటిని విడుదల చేశారు. తదుపరి గోదావరి డెల్టా సీఈ ఆర్.సతీష్‌కుమార్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు మిగిలిన 3 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు మధ్యడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద పూజలు నిర్వహించి కాలువకు సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఈస్ట్రన్ డివిజన్ ఈఈ కె.రామకృష్ణ, డీఈ ఇ.రమేష్, ఏఈఈ కె.నాగలక్ష్మి, ఏఈలు అద్దంకి సాయిరాం, ఆర్.సునీల్‌బాబు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాలువలకు నీరు విడుదల



విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద నీటిని విడుదల చేస్తున్న ఈఈ దక్షిణామూర్తి

నిడదవోలు, జూన్ 1: నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద శనివారం పశ్చిమ డెల్టా కాలువలకు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎమ్.దక్షిణామూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. కాలువలు కట్టేసిన అనంతరం తిరిగి పశ్చిమ డెల్టా కాలువలకు శనివారం నీటిని విడుదలచేసిన సందర్భంగా విజ్జేశ్వరం బ్యారేజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరించారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి చీర, రవిక, గాజులు, పువ్వులు, పండ్లు సమర్పించారు. అనంతరం హారతులిచ్చి ఈఈ దక్షిణామూర్తి బ్యారేజ్ వద్ద స్విచ్ ఆన్ చేసి పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిరోజు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, తర్వాత అవసరానికి తగినట్టుగా పెంచుతామన్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని రైతాంగం సార్వాను త్వరగా ప్రారంభించుకోవడం ద్వారా దాళ్వా కూడా త్వరగా ప్రారంభం అవుతుందన్నారు. ముందుగానే నీటిని విడుదల చేస్తున్నందున రైతాంగం ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శెట్టిపేట జేఈ కిరణ్ కుమార్, నీటి పారుదలశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కార్యక్రమంలో ఎక్కడా రాజకీయ నాయకులు లేకపోవడంతో కార్యక్రమ మంతా అధికారుల చేతులమీదుగా సాగింది.

సమస్యాత్మక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

- అల్లర్లలో కోనసీమ నంబరు వన్
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- అల్లర్ల అణచివేతకు క్యూఆర్టీ బృందాలు ● ఎస్ఈబీ ఐజీ రవిప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఐజీ రవిప్రకాష్, చిత్రంలో ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, జూన్ 1: ఏలూరు రేంజ్‌లో సమస్యాత్మక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు శాంతిభద్రతల ప్రత్యేక అధికారి, ఎస్ఈబీ ఐజీ ఎం.రవిప్రకాష్ తెలిపారు. ఏలూరు రేంజ్‌లో కోనసీమలో అల్లర్లతో నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి నియోజకవర్గాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఏలూరు జిల్లా పరిధిలో దెందులూరు, నూజివీడు, కృష్ణాజిల్లాలోని గన్నవరం, పెనమలూరు, మచిలీపట్నం నియోజకవర్గాలను సెన్సిటివ్ నియోజకవర్గాలుగా గుర్తించామన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి శనివారం ఐజీ రవిప్రకాష్ విలేఖరులతో మాట్లాడారు. ఏలూరు రేంజ్‌లో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలతో పాటు ఎక్కడా అల్లర్లు జరగకుండా క్విక్ రియాక్షన్ టీమ్(క్యూఆర్టీ)లను ఏర్పాటు చేశామన్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి జీపీఎస్ లోకేషన్స్ ఫీడ్‌చేసి క్యూఆర్టీ బృందాలకు అందించామన్నారు. ఒక్కో బృందానికి 5 నుంచి 15 గ్రామాల బాధ్యతను అప్పగించాం. ఎక్కడైనా గొడవ జరిగితే ఐదారు నిమిషాల వ్యవధిలోనే క్యూఆర్టీ బృందాలు అక్కడకు చేరుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్ఐ, సీఐల ఆధీనంలో క్యూఆర్టీ టీములను ఏర్పాటు చేశామన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశాం. ఇప్పటికే సెక్షన్ 30తో పాటు 144 సెక్షన్ అమలులో ఉందని వివరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని రేంజ్‌లో గతంలో ఆయా ప్రాంతాల్లో పనిచేసిన పోలీసు అధికారులను శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా నియమించామన్నారు. వీరితోపాటు పారా మిలటరీ, ఏపీ ఎస్పీ ఇతర బలగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పోలీసులు ప్రజాస్వామ్య పరిరక్షకులుగా ఉండడం పట్ల గర్వపడుతున్నామన్నారు. హింసకు పాల్పడడంవల్ల ప్రజలే నష్టపోతారన్నారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే కోర్టులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ప్రజలు కూడా బాధ్యత వహించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. ఇప్పటికే ప్రజాతీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉందని, ఎన్నికలు వస్తుంటాయి. పోతుంటాయి ప్రజలు కులాల పేరిట, వర్గాల పేరిట కొట్టుకోవడం తగదని హితవు పలికారు. డీజీపీ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ పార్టీలతో పాటు స్ట్రైకింగ్ ఫోర్సులు, పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. గొడవలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద జిల్లా ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షకులుగా ఉంటారన్నారు. లెక్కింపు సమయంలో గెలుపు ఓటముల ప్రభావం గ్రామాల్లో పడే అవకాశం ఉన్నందున వాటిని అరికట్టేందుకు క్యూఆర్టీ బృందాలు సిద్ధంగా ఉన్నట్టు ఐజీ వివరించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గోవింద నామస్మరణలతో మార్మోగిన వెంకన్న ఆలయం

- స్వామి ఒక రోజు ఆదాయం రూ.35.61లక్షలు

ఆత్రేయపురం, జూన్ 1: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం స్వామివారికి ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని దర్శించుకున్నారు. అశేష భక్తజనం తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా పోటెత్తిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.35.61లక్షలు లభించినట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

● వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నప్రసాద భవన నిర్మాణానికి మండపేటకు చెందిన బొడ్డు అవినాష్ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూన్ 1: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,21,420, అన్నదాన విరాళాలు రూ. 62,408 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 9,440 తులాభారం రూ.350, లడ్డూ ప్రసాదం ద్వారా 15,915 వెరసి రూ.3,09,533 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపాయి.. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణా చార్యులు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం: తిరుపతి శృంగారవల్లభస్వామి, దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

పద్మ పురస్కారాలకు క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలి

అమలాపురం టౌన్, జూన్ 1: గణతంత్ర వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే అత్యున్నత పద్మ పురస్కారాలు-2025కు అంతర్జాతీయ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో జిల్లా నుంచి అత్యున్నత ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన క్రీడాకారులు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు 1వ తేదీలోగా దరఖాస్తులను ఇ మెయిల్ ద్వారా అందజేస్తే అర్హులైన క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



శనేశ్వరాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కొత్తపేట, జూన్ 1: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) ఆలయానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామివారి సర్వ దర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,01,943 ఆదాయం లభించినట్టు ఆలయ ఏసీ, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నడకుదురు (కరప), జూన్ 1: కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురు పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. స్థానిక మైత్రి ఫర్నీచర్ షాప్ సమీపంలోని పంటకాలువలో మృతదేహం ఉన్నట్టు తమకు సమాచారం రాగా ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టామన్నారు. 60-70 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వృద్ధుడు పంటకాలువలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ అందులో పడి మరణించినట్టుగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరుస్తామని, అతని ఆచూకీ తెలిసిన వారు వివరాలను 9440 796557కుగాని, కరప పోలీస్‌స్టేషన్‌కుగాని తెలియజేయాలని ఎస్ఐ విజ్ఞప్తిచేశారు.

మోటార్ విడి భాగాలు పడి కార్మికుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన దేవుడు

పెద్దాపురం, జూన్ 1: కాకినాడ జిల్లా పెద్దాపురం వాలుతిమ్మాపురం ప్రధాన రహదారిలో ఉన్న పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మోటార్ విడి భాగాలు తలపై పడడంతో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిశ్రమలో పారా బాయిలర్ వద్ద పనిచేస్తున్న ఉల్లి దేవుడు (36)పై మోటార్ విడిభాగాలు పైనుంచి తలపై పడడంతో తీవ్రంగా గాయాలపాలై మృతి చెందాడు. అయితే పరిశ్రమ యాజమాన్యం మాత్రం ఈ విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేసిందని కార్మిక సంఘాలు ఆరోపించాయి. ఇటీవల కాలంలో పరిశ్రమలో అనేక ప్రమాదాలు జరిగినా యాజమాన్యం పట్టించు కోలేదన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ డిమాండ్ చేశారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై పోలీసులు కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిందితులకు రిమాండ్



గంజాయి తరలిస్తున్న నిందితులతో ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎంఈవో తాతబ్బాయిదొర

వై.రామవరం, జూన్ 1: మండలంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్టుచేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మండల ఎగువ ప్రాంతాల్లో గుర్తేడు, దారగడ్డ మీదుగా మోటారు బైక్‌పై గంజాయిని తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు కొమరవరం సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కృష్ణాజిల్లాకు చెందిన కుంబా సాయిప్రసాద్, ఆయాజిత్తుల కులదీప శ్రీనివాస మృత్యుంజయ, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కారా కృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. వారివద్ద నుంచి ఆరు కేజీల గంజాయితో పాటు ఒక మోటారు బైక్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అడ్డతీగల సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి తాతబ్బాయిదొర, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు



బాలబాలాజీస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, జూన్ 1: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకులు విశేష పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. తలనీలాలు సమర్పించే భక్తులతో కల్యాణకట్ట కిటకిటలాడింది. కొత్త, పాత ఆలయాల వద్ద భక్తుల కోలాహలంతో సందడి నెలకొంది. శనివారం వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలు రూ.2,70,590 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 3,849మంది భక్తులు దర్శించుకుని 3,061మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పు జట్లకు మూడో స్థానం



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు

పిఠాపురం, జూన్ 1: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు, మహిళల జట్లుకు మూడవ స్థానం లభించింది. విశాఖ జిల్లా తిమ్మాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి మెన్స్ అండ్ గర్ల్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా రగ్బీ జట్లు మంచి ప్రతిభ కనబరచాయి. రెండు జట్లు మూడవ స్థానంలో నిలవడంతో క్రీడాకారులను రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కోచ్ పి.లక్ష్మణరావు, టీఎమ్ మేనేజర్లు బి.వంశీ నవీన్, పవన్, జి.శివప్రసాద్‌లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. శ్రీనివాసకుమార్, కె.పద్మనాభం, టెక్నికల్ కమిటీ చైర్మన్ నాగలింగేశ్వరరావు, సభ్యులు వియ్యపు రామన్నరాజు, కేతవరపు కృష్ణ, సోము గోవిందరాజు తదితరులు అభినందించారు.

ఎన్నికల కౌంటింగ్

2వ ర్యాండమైజేషన్ పూర్తి

- కౌంటింగ్‌కు నలుగురు పరిశీలకులు
- జిల్లా ఎన్నిక అధికారి డాక్టర్ మాధవీలత



రెండో ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఆర్వో మాధవీలత , ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు బీజై కుమార్ కందయాత్‌రామ్, టాన్ సింగ్ జి, మోమిన్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్ 2వ ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు బీజై కుమార్ కందయాత్ రాయ్, టాన్ సింగ్ జిమోమిన్ సమక్షంలో శనివారం సాయంత్రం ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే మాధవీలత మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు సాంకేతికపరమైన విధానంలో కౌంటింగ్ సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. రెండో ర్యాండమైజేషన్‌లో భాగంగా కౌంటింగ్ నిర్వహించే క్రమంలో తొలి ర్యాండమైజేషన్‌లో గుర్తించిన సిబ్బందిని నియోజకవర్గాల వారీగా కేటాయింపులు చేస్తామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ జిల్లాకు నలుగురు ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులను నియమించినట్టు తెలిపారు. కె.బాల సుబ్రహ్మణ్యం, కమల్ కాంత్ సరోచ, బీజైకుమార్ కందయాత్ రాయ్, టాన్‌సింగ్ ఐజీ మోమినిల సమక్షంలో జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ తేజ్ భరత్, డీఆర్వో జి.నరసింహులు, సీపీవో ఎల్.అప్పలకొండ, ఎన్ఐసీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

- రూ.1.49 లక్షలు విలువైన విక్రయాలు నిలిపివేత

గొల్లప్రోలు, జూన్ 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని విత్తనాలు, ఎరువులు దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రవంతి ఆగ్రో ఏజెన్సీస్, శివ ఏజెన్సీస్‌లో తనిఖీలు జరిపారు. ప్రవంతిలో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంతో రూ.1.49 లక్షలు విలువైన 82.175కిలోల ప్రత్తి విత్తనాల విక్రయాలను నిలుపుదల చేస్తూ స్టాప్ సేల్ ఉత్తర్వులు జారీ చేశారు. శివ ఏజెన్సీస్‌లో అన్నీ సక్రమంగా ఉన్నా యి. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో నిరంతరాయంగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎవరైనా ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచినా నకిలీ విత్తనాలు విక్రయించిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు, శ్రీనివాసరెడ్డి, భార్గవరమేష్, నవీన్, జగన్నాథరెడ్డి, వల్లీ, కిషోర్, శివ, మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఏజెన్సీ సమాచారం

ఎన్నికల లెక్కింపు సజావుగా నిర్వహించాలి

● ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం, జూన్ 1: ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అన్ని మండలాల తహశీల్దార్లు, టీడీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, గ్రామ సచివాలయాల సర్వేయర్లతో ఈనెల 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు విధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీకి వేర్వేరుగా టేబుల్స్ ఏర్పాటుచేసి ఒక్కో టేబుల్లో నలుగురు సభ్యులను ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన లెక్కింపు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్లు ఏవీ రమణ, డీవీ సత్యనారాయణ, నాగరాజు, సత్య సులోచన, చలపతిరావు, డీటీలు బి.రాజు, త్రిమూర్తులు, సుధాకర్ బాబు, శివ, చైతన్య, ఈ.సత్యనారాయణ, సరిత, విశ్వనాద్, శ్రీధర్, బాలాజీ, రవీంద్రబాబు, సచివాలయ సర్వేయర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి


రంపచోడవరం కోదండరామాలయంలో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం, జూన్ 1: రంపచోడవరం కోదండ రామాలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు యజ్ఞసూర్యసాయికిరణ్, మంతా సత్యనారాయణ సిద్ధాంతి, విరియాల వెంకటేశ్వరరావు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి సప్లయి అధినేత బది రెడ్డి సూరిబాబు భక్తులకు పులిహోర, ప్రసాదం అందజేశారు. ధర్మప్రచార భక్త మండలి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, విశ్వహిందూపరిషత్ కార్యవర్గ సభ్యులు, సమరత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ గుడ్ల అంకశ్రీనివాసరెడ్డి, ధర్మ ప్రచార భక్తమండలి కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.



మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో పొల్లూరు గ్రామంలో ప్రధాన అర్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామిశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి అభిషేకం, విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పేపకాయ శ్రీను దంపతులు స్వామి వారికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్ రాఘవన్, శివ, కిలాడి రామచంద్రమూర్తి, గోవిందరాజు రెడ్డి, త్రిమూర్తులు, పొల్లూరు గ్రామ ప్రజల పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం: మండలంలోని వీఆర్ పురంలోని జూనియర్ కాలేజీ సమీపంలో ఉన్న శ్రీఆంజనేయ స్వామివారి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. మండలంలోని ఉమ్మడివరం, చింతరేవుపల్లి, గ్రామాల్లోని ఆంజనేయస్వామివారి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆయా దేవాలయాల ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిటీ సభ్యుడు లొల్ల సుధాకర్, అలజింగ శైలు, గూటాల పుల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


వీఆర్‌పురం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న భక్తులు

విత్తనాలు దించేందుకు
గొడౌన్ ఏదీ?

● కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రైతులకు తప్పని ఇబ్బందులు

రాజవొమ్మంగి, జూన్ 1: రైతులకు ప్రభుత్వ సబ్సిడీద్వారా అందించే విత్తనాలు దించేందుకు రాజవొమ్మంగిలో గొడౌన్ కరువైంది. రాజవొమ్మంగి మండల కేంద్రంలో పదులకొద్దీ భవనాలు నిర్మించి నిరూపయోగంగా ఉన్న ఏ భవనం వినియోగించలేని పరిస్థితి. నిర్మాణంలో ఉన్న రాజవొమ్మంగి 1, 2 సచివాలయాల భవనాల్లో వెనుకవైపు ఫెర్టిలైజర్స్ గొడౌన్‌కు ఒక గదిని కేటాయించారు. సచివాలయ భవనాలు నేటికీ పూర్తికాక ఆ భవనాలు వినియోగంలోకి రాలేదు. రాజవొమ్మంగి రైతు భరోసా భవనాన్ని సైతం చివరి వరకు కట్టి కాంట్రాక్టర్ పూర్తిచేయకుండా వదిలేశాడు. అసంపూర్తిగా ఉన్న రాజవొమ్మంగి సచివాలయం-2 భవనాన్ని అధికారులకు అప్పజెబుతామని గతంలో కాంట్రాక్టర్ ప్రయత్నించిన పంచాయతీ కార్యదర్శి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని తీసు కునేందుకు ఒప్పుకోలేదు. శుక్రవారం ఎంటీయు 1318 రకం విత్తనాల బస్తాలు రాజవొమ్మంగి-1, 2, బరదనాంపల్లి, దూసరపాము సచివాలయ పరిధిలోని రైతులకు ఇవ్వాల్సిన విత్తనాలు రాజవొమ్మంగి రావాల్సి ఉంది. ఆ బస్తాలు దించేందుకు రాజవొమ్మంగిలో ఏ గొడౌన్ దొరకలేదు. పోని ఏదైనా ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకొని అక్కడ అన్‌లోడ్ చేద్దామంటే, రాజవొమ్మంగి గ్రామంలో ఎవరు అద్దెకు ఇవ్వలేదు.. ప్రతి ఏడాది విత్తనాలను సొసైటీ గొడౌన్‌లో దించి రైతులకు అక్కడే విత్తనాలను అధికారులు అందజేసేవారు. ప్రస్తుతం ఆ గొడౌన్‌ను సొసైటీ వారు ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇవ్వడంతో ఈ ఏడాది వ్యవసాయశాఖ అధికారులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. దీంతో జడ్డంగికి సంబంధించిన విత్తనాల బస్తాలతోపాటు రాజవొమ్మంగిలో దించాల్సిన బస్తాలను అధికారులు జడ్డంగిలోనే దించేశారు. అక్కడి నుంచి రాజవొమ్మంగికి వాటిని తీసుకెళ్లాలంటే సుమారు 20వేల వరకు రవాణా చార్జీలు అవుతాయని అంచనా, ఆసొమ్ములు అధికారులు పెట్టుకుంటారా..? లేక నాలుగేళ్లుగా భవన నిర్మాణాలు సాగదీస్తున్న కాంట్రాక్టర్ పెట్టుకుంటాడా..? లేక రైతులపైనే ఆ భారం పడుతుందా చూడాల్సి ఉంది.


అసంపూర్తిగా ఉన్న రాజవొమ్మంగి ఆర్‌బీకే

నేడు ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 1: ది రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఛాంబర్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, గౌరవ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు ఖాయిదా కొట్లు వీధిలోని ఛాంబర్ భవనంలో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ కంటి వైద్యులు, గుండె వైద్యులు, పలు విభాగాల సర్జరీ వైద్యులు, గైనకాలజీ వైద్యులు పాల్గొంటారన్నారు. వ్యాపార సంస్థల్లో పనివారు, జట్టు కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


అనపర్తిలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న నల్లమిల్లి


రంగంపేటలో ఆంజనేయస్వామికి లక్ష అప్పాలతో పూజలు చేస్తున్న భక్తులు


రాజమహేంద్రవరంలో ప్రసాద వితరణ చేస్తున్న ఆదిరెడ్డి అప్పారావు దంపతులు

హనుమజ్జయంతి వేడుకలు

- ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తమలపాకులతో అర్చనలు, సింధూర అభిషేకాలు
- పలుచోట్ల హనుమాన్ చాలీసా పారాయణం


రాజానగరంలో తమలపాకుల మాలలతో ఆంజనేయస్వామి

రాజానగరం, జూన్ 1: హనుమత్ జయంతి వేడుకలను శనివారం పలుచోట్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు కన్నుల పండువుగా చేశారు. రాజానగరంలోని హైస్కూల్ జంక్షన్ వద్ద పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. స్థానిక రావులచెరువు గట్టున ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి తమలపాకుల పూజలు, వడమాలలు, సిందూర అభిషేకాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని చక్రద్వారబంధం, కానవరం, ఫరిజల్లిపేట, రాధేయపాలెం, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడ, పల్లకడియం, నరేంద్రపురం,నందరాడ, కలవచర్ల, సీతారాంపురం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ధవళేశ్వరం: స్థానిక గడియార స్తంభం వద్ద నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ ప్రాంగణంలో నిలువెత్తు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక రమా సత్యనారాయణ స్వామి వ్రతాలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. బస్టాండ్ సెంటర్ వద్ద అభయాంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్ స్వామి వారిని దర్శించు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో పంచాయతీ వీధిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కర్త ఓబిలినేని వెంకటకృష్ణ ఆధ్వర్యంలోను, ఊలపల్లి రోడ్డులో వున్న 50 అడుగుల ఆంజనేయ స్వామి వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. తొస్సిపూడిలోని శ్రీభక్త ఆంజనేయస్వామిని కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈయన వెంట నాయకులు కర్రి శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, తొస్సిపూడి యూత్ పాల్గొన్నారు. ఊలపల్లిలో వంతెన వద్ద ఆంజనేయస్వామి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవదాయ శాఖ పరిధిలోని జనార్ధనగిరిపై ఆంజనేయస్వామి ఆలయం, శివాలయంలో కొలువైన ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులోని ఆగమాశ్రమంలో కొలువైన కోదండరామస్వామికి, హనుమంతుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సిందూరం, తమలపాకులతో పూజ అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హనుమంతుడికి అప్పాల దండవేసి నైవేద్యం సమర్పించారు. అలాగే శ్రీకృష్ణపట్నంలో అభయాంజనేయస్వామికి క్షీరాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. శ్రీరాంపురంలోనూ స్వామివారికి అభిషేకాలు తమలపాకులతో అర్చనలు చేసి సిందూరంతో పూజలు చేశారు.

లక్ష అప్పాలతో సహస్రనామ పూజలు

రంగంపేట, జూన్ 1: రంగంపేటలో మంచినీటి చెరువు వద్ద అభయాంజనేయ స్వామి ఆలయంలో సహస్రనామార్చాలతో లక్ష అప్పాల పూజ చేశారు. ఈ సందర్భంగా 11 మంది ఆంజనేయస్వామి దీక్ష చేపట్టి తమలపాకులు, సిందూరంతో ఆలయార్చకుల వేద మంత్రోచ్చారణతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఉంగరాల అప్పారావు, ఎస్‌వీవీ సత్యనారాయణ, గురుస్వామి ఉండవిల్లి సుబ్బారావు, దీక్షాదారులు గారపాటి నరేష్, పద్దరాజు, సాయి, శివ, రామకృష్ణ, బబుల్, రాజశేఖర్, జస్వంత్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కడియం: కడియపులంక ఆంజనేయస్వామి లక్ష పుష్పార్చనకు సిద్ధం చేసిన పువ్వులు

ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కడియం: కడియం ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఆలయకమిటీ, భక్తులు ర్యాలీ నిర్వహించారు. అలాగే కడియపుసావరం, మాధవరాయుడు పాలెం, జేగురుపాడు హనుమాన్‌నగర్, మురమండ, దుళ్ళ, దామిరెడ్డిపల్లి హనుమాన్‌నగర్, వీరవరం, కడియపులంక, పొట్టిలంక, బుర్రిలంక, వేమగిరి గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమత్‌జయంతి వేడుకలు జరిగాయి. కడియపులంక ఆంజనేయస్వామి ఆలయం వద్ద సత్యదేవా నర్సరీ రైతులు పుల్లా చంటియ్యమహాలక్ష్మి దంపతులు, పుల్లా పెదసత్యనారాయణ-శ్రీదేవి దంపతులు 108 రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. బుర్రిలంక ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు.

అనపర్తి: మండలంలోని అనపర్తిలో అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నియోజకవర్గ కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. అలాగే రామవరం, మహేంద్రవాడ గ్రామాల్లో ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనపర్తి కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, బ్రూస్‌లీ, గొలుగూరి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ హరేరామ సమాజం వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో తమలపాకులు, సిందూరంతో ప్రత్యేక అర్చనలు జరిగాయి. ఈ సందర్భంగా 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కపిలవాయి ఓం నమఃశివాయ శర్మ, ఫణీంద్ర, మిరియాల శేషు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే కోరుకొండ దేవుని కోనేటి అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, తమలపాకుల పూజలు జరిగాయి. గాంధీచౌక్ వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గాడరాడ ఓంశివశక్తి పీఠంలో పంచ ముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మునగాల, బూరుగుపూడి, మధురుపూడి, దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు చేశారు.

రాజమహేంద్రవరం సిటీ/రాజమహేంద్రవరం కల్చరల్: హనుమంతుడి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వీర రాఘవమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ఆంజనేయ స్వామికి తమలపాకులు, తులసీ ఆకులతో అభిషేకం చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పుష్కరాలరేవులోని గోపాడ గోసాయిబాబా మఠంలో బొండాడ దుర్గారాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పురోహితుడు ఫణిశర్మ ఆంజనేయ స్వామికి సుగంధ ద్రవ్యాలు, పలు రకాల పండ్ల రసాలు, పంచామృతాలు, సిందూరం, తమలపాకులు తులసీదళాలతో పూజలు చేశారు. గోరక్షణపేట వాటర్ టాంకుల వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ధవళేశ్వరంలో పూజలు చేస్తున్న చందన నాగేశ్వర్


కోరుకొండలో హనుమాన్ చాలీషా పారాయణం


రాజమహేంద్రవరంలో పూజల్లో ఎమ్మెల్యే జక్కంపూడి


బిక్కవోలు: తొస్సిపూడిలో రామకృష్ణారెడ్డి పూజలు

మంచి మెజార్టీతో గెలవబోతున్నాం : బత్తుల

కోరుకొండ, జూన్ 1: మరో రెండు రోజుల్లో వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా ఉండబోతున్నాయని, తాము మంచి మెజార్టీతో గెలవబోతున్నామని, అభిమానులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు సంయమనంతో ఉండాలని నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కౌంటింగ్ సందర్భంగా అధికార వైసీపీ రెచ్చగొట్టే ధోరణిలో ఉన్నప్పటికీ కార్యకర్తలు నిగ్రహం కోల్పోవద్దన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనల్లో తలదూర్చవద్దని, కేసుల్లో ఇరుక్కోవద్దని, మనం సాధించే విజయాన్ని ఆనందించేందుకు ఓర్పు, సహనంతో ఉండాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ప్రత్యర్థులు ఎన్ని కవ్వింపు చర్యలకు దిగినప్పటికీ శాంతియుతంగా ఫలితాల కోసం ఎదురుచూడాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కడియం జడ్పీ హైస్కూల్ 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కడియం, జూన్ 1: కడియం ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సుమారు 60మంది కుటుంబసభ్యులతో 20ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలిశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ సమ్మేళనానికి తమ మిత్రులు గుడాల శివ, శివరామకృష్ణ, విజయచంద్ర, లడ్డు శ్రీనివాస్, రత్నమాల, విజయకుమారి కృషి చేశారన్నారు.

తల్లిదండ్రుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక సభ్యుడు సంజీవరావు



రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 1: తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007లో వచ్చినప్పటికీ ఈనాటికీ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయకపోవడం విచారకరమని సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక సభ్యుడు కె.కె.సంజీవరావు అన్నారు. ఆర్యాపురం డాక్టర్ ఏబీ.నాగేశ్వరరావు పార్కులోని సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా కేర్ భవనంలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం ఇప్పటి నుంచైనా కమి టీలు వేసేలా సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 15న ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినం సందర్భంగా జిల్లా న్యాయాధికారి సంస్థ జడ్జిని ఆహ్వానించాలని కమిటీ నిర్ణయించిందన్నారు. కా ర్యక్రమంలో అశోక్‌కుమార్ జైన్, కార్యదర్శి మహంతి లక్ష్మణరావు, పృథ్వీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కాసాని శంకరరావు, జామిశెట్టి అప్పాజీ, బండి నరేంద్ర బాబు, ఎ.అప్పారావు, చప్పటి సత్యనారాయణ, ఎం.త్రినాథరావు పాల్గొన్నారు.

హమ్మయ్య చల్లబడింది!

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 1: జిల్లాలో ప్రచండ భానుడు కాస్త చల్లబడ్డాడు. శనివారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. జిల్లాలోని 18మండలాల్లో ఉష్ణోగ్రతలు 3డిగ్రీలు తగ్గడంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి సాయంత్ర వరకు చల్లగా ఉండడంతో వేడిగాలుల తీవ్ర లేదు. శుక్రవారం రాజమహేంద్రవరంలో గరిష్టంగా 42.0, కనిష్టంగా 29.0 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రత శనివారం గరిష్టంగా 40డిగ్రీలకు, కనిష్టంగా 28 డిగ్రీలకు తగ్గింది. ఉదయాన్నే పలు ప్రాంతాల్లో చిన్నగా తుంపర్లు పడి ఆగింది. ఇతర మండలాల్లోనూ ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతో హమ్మయ్య అంటూ కాస్త సేదదీరారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

ప్రైవేటు స్కూల్స్ కరస్పాండెంట్లతో డీఎస్ఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా పాటించి తీరాల్సిందేనని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల కరెస్పాండెంట్లతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ అకాడమిక్ కేలండర్‌ని అనుసరించాలన్నారు. గుర్తింపును సకాలంలో రెన్యువల్ చేసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు విక్రయించరాదని, విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజు వివరాలను విధిగా నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలోనూ కంప్లైంట్స్ బాక్స్ ఉండాలన్నారు. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను కచ్చితంగా పొందాలన్నారు. తగు అనుమతులు లేకుండా పాఠశాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీ వీ.వెంకట్రాజు, డీవైఈవో ఈవీబీఎన్ నారాయణ, అర్బన్ ఎంఈవో బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈవో ఎ.దుర్గా తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు లక్ష్మీగణపతికి ఎమ్మెల్యే పూజలు

బిక్కవోలు, జూన్ 1: బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతిని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయ కమిటీ ఛైరన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు.

కాంగ్రెస్ నేత కేవీపీకి ఘన స్వాగతం



కోరుకొండ, జూన్ 1: మధురుపూడి విమానాశ్రయానికి శనివారం వచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావుకు ఘనస్వాగతం లభించింది. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి ముంద్రు పెదబాబు, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, వీరగణేష్ ఉన్నారు.

వాహనాలు నడుపుతున్న మైనర్లకు జరిమానా

ధవళేశ్వరం, జూన్ 1: ధవళేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో వాహనాలు నడుపుతున్న 9 మంది మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.5 వేలు జరిమానా విధించారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి సౌత్ జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్, ధవళేశ్వరం సీఐ వినయ్‌మోహన్ కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబాలు తల్లడిల్లిపోతాయని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలన్నారు.

ఎస్‌కేవీటీలో ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణ

రాజమహేంద్ర వరం కల్చరల్, జూన్ 1: ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనేక క్రీడలకు కేరాఫ్ అడ్రస్‌గా మారడం సంతోషదాయకంగా ఉందని ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు అన్నారు. కళాశాల ఆవరణలో జరుగుతున్న ఉచిత ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శనివారం ముగిసింది. విద్యార్థులకు ప్రశంసాపత్రాలను కొఠారి మౌనికజైన్ అందించారు. కార్యక్రమంలో పీవీబీ సంజీవరావు, సిరా గంగాధరరావు, సుంకర నాగేంద్రకిషోర్, ఎం.శేషగిరిరావు, గోపాల రావు, ఆనంద్, పీవీ కిశోర్‌బాబు, బి.మణికంఠ పాల్గొన్నారు.

నేడు చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 1: రాజమహేంద్రవరంలోని కాల్ ఫ్యూజన్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు ఆదివారం అంతర్గత చెస్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అకాడమీ డైరెక్టర్ కుమార్ విత్తనాల ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 8 గంటలకు హాజరుకావొచ్చని పేర్కొన్నారు.

ఏజెన్సీలో విస్తరిస్తున్న బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం



మాట్లాడుతున్న సర్కిల్ చీఫ్ మేనేజర్ శేషాచలం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 1: ప్రధాన మంత్రి అంత్యోదయ పథకంలో భాగంగా 400 టవర్స్ ఏజెన్సీ ప్రాంతాల్లో మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రానున్నాయని బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం తెలిపారు. గోకవరం బస్టాండు సమీపంలోని బీఎస్ఎన్ఎల్ నన్నయ సంచార్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ 4జీ టెక్నాలజీ సేవల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో మరింత వేగవంతమైన నెట్ సేవలందిస్తామన్నారు. అర్బన్ ప్రాంతాల్లో 400లొకేషన్లలో 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. సమావేశంలో జనరల్ మేనేజర్(మొబైల్) ఎ.శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం జనరల్ మేనేజర్ పి.రాజు, డీజీఎం రాజశేఖర్‌బాబు, నాగరాజు, సత్యనా రాయణ, ఏజీఎంలు బమ్మిడి శ్రీనివాస్, శారదాదేవి, పీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీశైలానికి ఉచితంగా మొక్కలు


కడియం, జూన్ 1: కడియపులంక ముసలమ్మ ఆలయం నుంచి కడియపులంక నర్సరీరైతులు బొర్సు శ్రీనివాసరావు, నక్కా ప్రసాద్, నాగిరెడ్డి రవి, శ్రీధర్, పంతం సుబ్రహ్మణ్యం, పుల్లా చిన సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీను శ్రీశైల దేవస్థానానికి ఉచితంగా నీడనిచ్చే, అలంకార మొక్కలను అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి




కడియం, జూన్ 1: గుర్తు తెలియని వ్యక్తి చనిపోయినట్టు కడియం పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో కడియం మండలం వేమగిరి మణికంఠ రెస్టారెంట్ సమీపంలో సుమారు 70 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి అపస్మాకర స్థితిలో ఉన్నట్టు గుర్తించడంతో అతనిని 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ అదే రోజు చనిపోయినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహం మార్చురీలో భద్రపరిచారని, ఆచూకీ తెలిసిన వారు కడియం పోలీసులను సంప్రదించాలన్నారు.

రైలు ఢీకొని ప్రింటింగ్ ప్రెస్ యజమాని మృతి


వెంకటరెడ్డి (ఫైల్‌ఫొటో)

అనపర్తి, జూన్ 1: అనపర్తిలో గూడ్సు రైలు ఢీకొని స్థానిక రామకృష్ణ ప్రింటింగ్ ప్రెస్ యజమాని గొలుగూరి వెంకట రెడ్డి(60)మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మూతపడ్డ రైల్వే గేటు నుంచి అవతలివైపు వెళ్లే క్రమంలో రెండు వైపులా రైళ్లు వస్తున్నప్పటికీ చూసుకోకుండా పట్టాలు దాటే క్రమంలో గూడ్సు రైలు ఢీకొట్టడంతో వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటరెడ్డి గ్రామంలో సుమారు 30 ఏళ్లుగా ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నారు. సౌమ్యుడిగా పేరున్న ఆయన మృతి పట్ల వర్తకులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. స్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు సామర్లకోట రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ మాధవీలత చిత్రంలో ఎస్పీ, జేసీ


నన్నయ వర్సిటీ వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీశ్

4న ట్రాఫిక్ మళ్లింపు

- నన్నయ వర్సిటీలో ఓట్ల లెక్కింపు
- దివాన్‌చెరువు నుంచి రాకపోకలు నిషేధం
- బెజవాడ టూ విశాఖ వాహనాలకు బ్రేక్
- ఉదయం 4 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

రాజమహేంద్రవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4 (మంగళవారం)న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత, ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలుపుకోవాలన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు మంగళవారం ఉదయం 4గంటల నుంచి అమల్లో ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

- దివాన్ చెరువు సమీపంలోని జీరో పాయింట్ నుంచి రాజానగరం దుర్గమ్మ గుడి జంక్షన్ మధ్య జాతీయ రహదారిపైకి ఎలాంటి వాహనాలకూ అనుమతి ఉండదు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలి.
- విజయవాడ వైపు నుంచి విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలను దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో 4వ తేదీ తెల్లవారు జామున 4 గంటల నుంచి తదుపరి అనుమతిచ్చే వరకూ నిలిపివేస్తారు.
- విశాఖపట్నం నుంచి చెన్నై వైపు వెళ్లే భారీ వాహనాలు కత్తిపూడి నుంచి పిఠాపురం, కాకినాడ,యానాం, అమలాపురం, మొగల్తూరు, అవనిగడ్డ, రేపల్లె, ఒంగోలు గుండా ప్రయాణించాలి. హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు రాజానగరం,కలవచర్ల జంక్షన్, ఏడీబీ రోడ్, కాకినాడ, ఎస్‌టీ రాజాపురం జంక్షన్,అనపర్తి కెనాల్ రోడ్, కడియం, రావులపాలెం గుండా వెళ్లాలి. హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లే కార్లు, 10 టైర్ల లారీలు,బస్సులు తదితర వాహనాలు నరేంద్రపురం జంక్షన్, నందరాడ, దోసకాయలపల్లి,ఎయిర్‌పోర్టు, కొంతమూరు గుండా ఎన్‌హెచ్ పైకి చేరుకొని యూటర్న్ తీసుకొని కొవ్వూరు మీదుగా ప్రయాణించాలి.
- రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్లే ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన వాహనాలు జీరోపాయింట్, కొంతమూరు, ఎయిర్‌పోర్టు, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నందరాడ, నరేంద్రపురం జంక్షన్ వద్ద ఎన్‌హెచ్-16పైకి చేరుకోవాలి.విశాఖ నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ వాహనాలు నరేంద్రపురం జంక్షన్, నందరాడ, దోసకాయలపల్లి, బూరుగుపూడి, ఎయిర్‌పోర్టు, కొంతమూరు, దివాన్‌చెరువు, జీరోపాయింట్ ద్వారా వెళ్లాలి.
- హైదరాబాద్, విజయవాడ వైపు నుంచి విశాఖ వెళ్లే వాహనాలు కొవ్వూరు మీదుగా కొంతమూరు వద్ద హైవేపై సర్వీసు రోడ్డు మీదుగా కిందికి దిగి ఎయిర్‌పోర్టు, బూరుగుపూడి, కోరుకొండ, గోకవరం, కొత్తపల్లి, మల్లిశాల, జగ్గంపేట వద్ద ఎన్‌హెచ్-16కి చేరుకోవాలి.
- రావులపాలెం వైపు నుంచి విశాఖ వెళ్లే వాహనాలు లాలాచెరువు, దివాన్ చెరువు,జీరో పాయింట్ వద్ద యూటర్న్ తీసుకొని కొంతమూరు వద్ద హైవే నుంచి సర్వీస్ రోడ్డుకు చేరుకొని ఎయిర్‌పోర్టు, కోరుకొండ, గోకవరం, కొత్తపల్లి, మల్లిశాల, జగ్గంపేట వద్ద ఎన్‌హెచ్-16 ఎక్కాలి.
- రాజమండ్రి నుంచి కాకినాడ వెళ్లే వాహనాలు వేమగిరి, కడియం, ద్వారపూడి గుండా..కాకినాడ నుంచి రాజమండ్రి వచ్చే వాహనాలు సామర్లకోట, బిక్కవోలు, కడియం, వేమగిరి గుండా ప్రయాణించాలి.

కౌంటింగ్ సిబ్బంది..ఏజెంట్లు పార్కింగ్ ఇక్కడే..

కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, పోటీ చేసిన అభ్యర్థులు, పోలీస్ అధికారులు, సిబ్బందికి పార్కింగ్ స్థలాలను కేటాయించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుస్తారు.

1.రాజమండ్రి వైపు నుంచి వచ్చే అన్ని రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు దివాన్‌చెరువు వద్ద ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా తూర్పు వైపున ఉన్న డీవీబీ రాజు ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.

2. రాజానగరం వైపు నుంచి వచ్చే ఏజెంట్లు రాజానగరం దుర్గమ్మగుడి జంక్షన్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలి.

3. రాజమండ్రి, రాజానగరం వైపు నుంచి వచ్చే కౌంటింగ్ ఆఫీసర్స్ సిబ్బంది, మీడియా గైట్ కళాశాల గ్రౌండ్‌లో వాహనాలు పార్క్ చేయాలి.

4. ఆర్‌వోలు,ఏఆర్‌వోలు,అభ్యర్థులు, చీఫ్ ఎలోన్ ఏజెంట్స్ వర్సిటీ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు పార్క్ చేసుకోవాలి.

5. పోలీస్ అధికారులు, ఇతర శాఖల వారు తమ వాహనాలను శ్రీ గణపతి సచ్చిదానంద గురుదత్త ఆశ్రమంలో ఖాళీ స్థలంలో నిలుపుకోవాలి. అక్కడి నుంచి మెయిన్ గేటు వద్దకు చేరుకోవాలి.

ఇతర నిబంధనలు..

1. గన్‌మ్యాన్‌లు అభ్యర్థులతో పాటు వచ్చి యూనివర్సిటీ గ్రౌండ్‌లో టెంట్‌లో కూర్చోవాలి.ఆయుధాలతో కౌంటింగ్ హాల్ వద్దకు వెళ్లకూడదు.
2. కౌంటింగ్ హాలులోకి సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థులు,అధికారులు సెల్‌ఫోన్లు,ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, వాటర్ బాటిల్స్, లైటర్లు, సిగరెట్లు తీసుకెళ్లరాదు.
3. కౌంటింగ్ వద్ద డ్రోన్ కెమెరాలతో నిరంతరం గమనిస్తూ ఉంటారు.

విజయోత్సవ ర్యాలీలపై నిషేధం

- ప్రశాంత కౌంటింగ్‌కి పకడ్బందీ ఏర్పాట్లు
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరైనా జైలుకే
- కౌంటింగ్ ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ

రాజమహేంద్రవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేయడానికి పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.కౌంటింగ్ కేంద్రాలు, వివిధ ప్రాంతాల్లో శనివారం పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. 4వ తేదీన అనవసరంగా రోడ్లపై, వీధుల్లో తిరగడం చేయవద్దని సూచించారు.ఎన్నికల కేసుల్లో నమోదైతే జీవితం ఇబ్బందుల్లో పడుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాలు పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయన్నారు. జిల్లా మొత్తాన్నీ లైవ్ స్ట్రీమింగ్ డ్రోన్ కెమెరాలతో నిరంతరం గమనిస్తూ ఉంటామన్నారు. ఫలితాల తర్వాత విజయోత్సవ ర్యాలీలపై నిషేధం ఉందన్నారు. గొడవలు, విద్వేషాలు, అల్లర్లు సృష్టించడం, కవ్వింపు చర్యలకు దిగడం వంటివి చేస్తే వెంటనే అరెస్టు చేస్తామన్నారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా ఆల్కహాల్ టెస్టింగ్ చేసి మద్యం తాగినట్లు తేలితే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.జిల్లాలో సీఆర్పీసీ 144, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో పోలీసులకు సహకరించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులుంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించడం తమ బాధ్యతగా భావించాలన్నారు.

జై హనుమాన్


హనుమజ్జయంతిని శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కడియపులంకలో 108 రకాల పువ్వులతో పూజించారు.. - 8లో



కూటమికే.. జై కొట్టారు!

ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో ఫ్యాన్ గల్లంతు

- తూర్పున క్లీన్ స్వీప్ - పైచేయి సాధించిన కూటమి
- 7 అసెంబ్లీ, పార్లమెంట్ స్థానంలోనూ గెలుపు
- రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం వస్తున్నట్టు తేల్చివేత
- ఎగ్జిట్ పోల్ ఫలితాలతో కూటమిలో మరింతగా జోష్
- వైసీపీ ఓటమి ఖాయమని తేలడంతో అభ్యర్థుల్లో డీలా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమిదే పైచేయిగా తేలింది. భారీ సీట్ల ఆధిక్యతతో అధికారంలోకి రాబోతున్నట్టు సుస్పష్టమైంది. అధికార వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతున్నట్టు శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్‌పోల్ ఫలితాలు తేటతెల్లం చేశాయి. 8 సంస్థలు సర్వే చేయగా 5 టీడీపీ కూటమికే పట్టం కట్టాయి. భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వం రాబోతున్నట్టు తేల్చి చెప్పాయి. జిల్లాలో ఏడుకు ఏడు సీట్లు టీడీపీ, జనసేన, బీజేపీ గెల్చుకోబోతున్నట్లు స్పష్టం చేశాయి. ఒకరకంగా చెప్పాలంటే మంగళవారం వెలువడనున్న ఫలితాల్లో జిల్లాలో టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ ఖాయమని పేర్కొన్నాయి. గత నెల 13న జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి బట్టి టీడీపీ,జనసేన, బీజేపీ భారీగా విజయం సాధించబోతున్నట్టు భారీ విశ్లేషణలు వ్యక్తమయ్యాయి. అధికార వైసీపీ అరాచకాలు,ప్రజావ్యతిరేక నిర్ణయాలతో విసుగెత్తిన ఓటర్లు ఆ పార్టీకి ఓటుతో బుద్ధిచెప్పారని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం గెలుపు ఖాయం అని ప్రతి ఒక్కరి నోటా అభిప్రాయం వ్యక్తమైంది.దీనికి తగ్గట్టుగానే ఎగ్జిట్‌పోల్ సర్వే ఫలితాలు కూటమిదే విజయమని తేల్చేశాయి. దీంతో సంబరాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమిలో జోష్..

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూటమిలో జోష్‌ను పెంచాయి. సుమారు 8 సంస్థలు చేసిన సర్వే ఐదు సంస్థలు కూటమికే అధికారాన్ని ఇచ్చాయి. జాతీయ స్థాయిలో చేసిన సర్వేలలో కూడా ఎక్కువ ఎంపీ స్థానాలు కూటమికే వస్తాయని చెప్పడం గమనార్హం. జిల్లాలో రాజమహేంద్ర వరం ఎంపీ స్థానంతో పాటు, ఏడు అసెంబ్లీ స్థానాలు కూటమికే వస్తాయని అంచనా వేస్తున్నారు.ఒకటి రెండు చోట్ల ఫైట్ ఉందని చెబుతున్న ప్పటికీ పోలింగ్ రోజు నుంచి ఇప్పటి వరకూ జనం నోట వినిపిస్తున్న మాట ప్రకారం కూటమికే అవకాశాలు ఉన్నాయి.సైలెంట్ వేవ్‌తో కూటమి అభ్యర్థులు గెలవనున్నారని, ఓట్లేసిన వారిలో ఎక్కువ మంది చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న సంగతి తెలిసిందే. దానికి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో వివిధ వర్గాల ప్రజలు వైసీపీకి దూరమయ్యాయి. కేవలం సంక్షేమ పథకాల పేరిట ఓట్లు వేసి ఉంటారనే భ్రమలోనే అధికార పార్టీ ఉంది. వాస్తవానికి జిల్లాలో పోటీ చేసిన వైసీపీ అభ్యర్థులు ప్రచారంలో చెమటలు కక్కారు. సామాజిక వర్గాల్లో విభజన ద్వారా కొంతమేరైనా ఓట్లు తెచ్చుకోవాలని తెగతంటాలు పడ్డారు. డబ్బు కూడా ఖర్చు చేశారు. కానీ గత నెల 13న జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఓటర్లంతా ఎక్కువగా కూటమి వైపే ఉన్నట్టు తేలింది. టీడీపీ,జనసేన, బీజేపీ కలవడంతో వారి బలంగా బాగా పెరిగింది. అంతేకాదు ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చింది. అదే ఫలితాలు ఇస్తుంది.

రెండు రోజుల్లోనే ఫలితం

ఈనెల 4వ తేదీన కౌంటింగ్. ఇక మధ్యలో రెండు రోజులు మాత్రమే ఉంది. ఆదివారం, సోమవారం గడిస్తే మంగళవారం ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ఆరంభిస్తారు. 12 గంటలలోపే ఫలితం తేలిపోతోంది. జిల్లాలో 80.93 శాతంగా పోలింగ్ నమోదైంది. అత్యధికంగా రాజానగరం నియోజకవర్గంలో 87.54 శాతం నమోదు కాగా అత్యల్పంగా రాజమహేంద్రవరం సిటీలో 67.57 శాతం నమోదైంది. ఇక గోపాలపురంలో 86.67 శాతం,అనపర్తిలో 86.23 శాతం, కొవ్వూరులో 85.90 శాతం, నిడదవోలులో 84.67 శాతం. రాజమహేంద్రవరం రూరల్‌లో 73.02 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా 13,13,645 మంది ఓటు హక్కు వినియోగించుకు న్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేయగా, వైసీపీ ఒంటరిగాపోటీ చేసింది. కాంగ్రెస్, వామపక్షాలు కూటమిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే.ఇలా మొత్తం 83 మంది అభ్యర్థులు పోటీపడగా అందులో 59మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.అయితే ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.స్వతంత్రులు ఎక్కడా కనబడలేదు.

అటు సంబరం..ఇటు నీరసం..

ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో జిల్లా టీడీపీలో సంబరాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నేళ్ల పోరాటం ఫలించిందంటూ ఆనందపడుతున్నాయి. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తుందని తేలడంతో నేతలు,కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. తామేదైతే విశ్లేషించుకున్నామో ఎగ్జిట్‌పోల్ ఫలితాలు కూడా అలాగే రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలోను భారీ సీట్లు టీడీపీ కూటమి దక్కించుకుంటుందని ఎగ్జిట్‌పోల్ ఫలితాల్లో తేలడంతో వైసీపీ అరాచక పాలనకు ప్రజలంతా బుద్ధిచెప్పినట్లయిందని పేర్కొంటున్నారు.టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి జిల్లాలోను, రాష్ట్రంలోను ప్రభంజనం సృష్టిస్తుందన్న అంచనాలు నిజమయ్యాయని నియోజకవర్గ అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నొక్కిన ఉత్తుత్తి బటన్‌లను ప్రజలు నమ్మలేదని, ముఖ్యంగా మహిళలు వైసీపీకి బుద్ధి చెప్పారని వివరిస్తున్నారు. టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో కూటమికి ఓట్లు భారీగా రాల్చిందని చెబుతున్నారు. ఎగ్జిట్‌పోల్ ఫలితాల అనంతరం ఆయా పార్టీల నేతలు,కార్యకర్తలు ఫోన్లు చేసుకుని సంతోషం పంచుకున్నారు. అటు అధికారపార్టీ నేతలను ఎగ్జిట్‌పోల్ ఫలితాలు తీవ్ర నిరాశలో ముంచేశాయి. వైసీపీ గద్దె దిగడం ఖాయమని తేలిపోవడంతో జిల్లాలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీలా పడిపోయారు. రాష్ట్రంలో ఒక్క సీటు కూడా వచ్చే చాన్స్ లేదని తేలడంతో రాజకీయ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.



పోలీస్..దందా!

అడిగింది ఇచ్చుకో.. నచ్చింది చేసుకో..

- ఎన్నికల విధుల్లో ఎస్పీ బిజీబిజీ
- కొందరు మాత్రం అలసత్వం
- ఎన్నికల విధుల పేరుతో దోపిడీ
- ఒక డీఎస్పీపై తీవ్ర ఆరోపణలు
- సీఐ, ఎస్ఐలతో సొంత పనులు
- ఇటీవలె హెచ్చరించిన ఎస్పీ?
- అయినా మారని తీరు
- పట్టుతప్పుతున్న ఖాకీలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ జగదీశ్‌తో సహా జిల్లాలోని ఖాకీ యూనిఫాంలకు నిమిషం విశ్రాంతి దొరకడం లేదు.కౌంటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ హైరానా పడుతున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తు బందోబస్తులో మునిగిపోయారు.అల్లర్లు సృష్టిస్తే జైలుకు పంపిస్తామని ఐజీ అశోక్ కుమార్, పోలీస్ ఇమేజ్‌ని మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని డీజీపీ(శాంతి భద్రతలు) శంఖబ్రత బాగ్చి ఇటు ప్రజలకు అటు సిబ్బందికి స్పష్టం చేశారు. జిల్లాలో అల్లర్ల మాట ఎలా ఉన్నా.. ఇంటి దొంగల పని పట్టకపోతే మాత్రం కష్టమేననే చర్చ నడుస్తోంది. ఖాకీల్లోని కొందరి అలసత్వ తీరు, వారిని ఉన్నతాధికారులు హెచ్చరించి వదిలేయడం విమర్శలకు తావిస్తోంది.అసాంఘిక వ్యక్తులతో అంటకాగడం,అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా వ్యవహరించడం వంటివి కష్టపడి పనిచేసే సిబ్బంది, అధికారులను ఆవేదనకు గురిచేస్తు న్నాయి. ఎన్నికల బందోబస్తులో జిల్లా పోలీసులు తీరిక లేకుండా ఉండగా ఓ డీఎస్పీ మాత్రం 'సొంత' పనులు పురమాయిస్తూ ఇబ్బంది పెడు తున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలోని మరో డీఎస్పీ తీరుపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. అయినా ఆయన ఎన్నికల విధుల్లో కొనసాగుతూనే ఉన్నారు.

సబ్ డివిజనల్ అధికారిపై విమర్శలు

జిల్లాలోని ఓ సబ్-డివిజనల్ అధికారి ఇటీవల ఎన్నికల కోటాలో బదిలీపై వచ్చారు. ఆయనపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వచ్చీ రావడంతోనే ఎన్నికల ప్రొటోకాల్‌ని తన సొంత ప్రొటోకాల్‌గా మార్చేసుకొని అక్రమ ఆదాయంపై దృష్టి సారించారనే ఆరోపణలు ఆ శాఖ అధికారుల నుంచి వినిపిస్తున్నాయి. తన కార్యాలయంలో ఏళ్లకు తరబడి పాతుకుపోయిన మరో చిరు అధికారి సహకారంతో ఇతర అధికారులపై జులుం ప్రదర్శిస్తున్నారని సమాచారం. ఎన్నికల విధుల్లో ఎస్పీ తదితర అధికారులు, సిబ్బంది ఉంటే..ఆ అధికారి మాత్రం సీఐలు, ఎస్ఐలను తన సొంత వ్యాపకాలకు వాడుకుంటున్నారని వాపోతున్నారు. ఇటీవల సబ్-డివిజన్ పరిధిలోని ఓ గ్రామంలో జాతర జరుగుతున్న సందర్భంలో కోడి పందేలు,పేకాట శిబిరాలకు అవినీతి మాటున అనుమతిచ్చారని తెలిసింది. ఈ విషయం ఎస్పీకి తెలియడంతో ఆ అధికారిని తీవ్రంగా మందలించారేగానీ..తదుపరి చర్యలు తీసుకోలేదని చర్చ నడుస్తోంది. మరో మండలంలోని ఓ గ్రామంలో జరుగుతున్న జాతరకు కోడి పందేలకు, పేకాటలను చూసీచూడకుండా వదిలేయడానికి తనకు పెద్ద మొత్తంలో డబ్బు కావాలంటూ ఆ జూదం నిర్వహించే వైసీపీ నాయకుడి గెస్ట్‌హౌస్‌కి వెళ్లి బేరసారాలు సాగించడం వివాదాలకు తావిస్తోంది. ఇలా తనకు లంచం ముట్టిన ప్రాంతాల్లో ఎలాంటి తనిఖీలు చేయవద్దని, నోరుమూసుకొని కూర్చోవాలని ఆయా పరిధుల్లోని అధికారులను ఆయన బెదిరిస్తున్నట్టు సమాచారం. అనుకూలంగా ప్రవర్తించకపోతే పాత కేసులను తిరగతోడి చార్జిమెమోలను జారీచేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కిందిస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆ అధికారి ఆయన కార్యాలయంలోనే నివాసం ఉండే అవకాశం ఉన్నా ప్రత్యేకంగా ఓ ప్రైవేటు ఇంటిలో ఉంటూ గ్యాంబ్లర్స్‌తో లావాదేవీలు చేస్తున్నారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోనే పేరు పొందిన ఓ గ్యాంబ్లర్ ఆ అధికారికి కుడిచేతిగా వ్యవహరిస్తూ సెటిల్‌మెంట్లలో కీలక మధ్యవర్తిగా ప్రవర్తిస్తు న్నాడని వినవస్తోంది.ఆయన తీరుతో కింది స్థాయి అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పోలీస్ సిబ్బంది, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందిపై నిఘా విభాగం ఆరా తీసి ఎస్పీకి సమర్పించడం, దానిపై ఆయన చర్యలు తీసుకోవడం తక్షణ అవసరం. సొంత పనులకు ప్రాధాన్యం ఇచ్చేవారిని ఎన్నికల విధుల నుంచి తప్పించడం శ్రేయస్కరం.

వైసీపీ పోస్టుకు కానిస్టేబుల్ కామెంట్..

పోలింగ్ రోజున దొమ్మేరులో చెలరేగిన అల్లర్లను అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారు.ఇప్పటికీ వైసీపీ నాయకులంటే భయం వారిలో కనిపిస్తోంది. పోలీసు అబ్జర్వర్ ఘటనా ప్రదేశానికి వెళ్లినా ఫలితం లేకపోయింది. కొవ్వూ రు రూరల్ పీఎస్‌లోని ఓ కానిస్టేబుల్ చేసిన పనిపై రగడ రేగుతోంది. వైసీపీకి అనుకూలంగా వచ్చిన పోస్టుకు 'బాగా విశ్లేషించారండీ' అంటూ కామెంట్ పెట్టడం వివాదానికి తావిస్తోంది.

ఇద్దరు కౌంటింగ్ ఏజెంట్లకు క్రిమినల్ కేసులు?

కౌంటింగ్ ఏజెంట్ల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇప్ప టికే సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలతో వైసీపీ ఏజెంట్లు రెచ్చిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం కౌంటింగ్ ఏజెంట్లుగా నమోదు చేసుకున్న ఇద్దరు వైసీపీకి చెందిన వారిపై కేసులు ఉన్నాయని చెబుతున్నారు. కౌంటింగ్ సిబ్బంది విషయంలోనూ జాగ్రత్తలు అవసరం.70 కార్డన్ సెర్చ్‌లు చేశామని ఎస్పీ చెబుతున్నా.. లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, ఫాంహౌస్‌లు, అపార్ట్‌మెంట్లలో అపరిచిత వ్యక్తుల గురించి సోదాలు మాత్రం జరగలేదు. మరో రెండు రోజుల్లో కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా టెన్షన్ నెలకొంది.

ఎల్లుండే కౌంటింగ్

- 4న ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్
- సమాంతరంగా ఈవీఎంలు, బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నం 2 గంటలకే లెక్కింపు ముగింపు
- కొవ్వూరు ఫలితం 12.40 గంటలకే వెల్లడి
- చివరిలో రాజమహేంద్రవరం రూరల్ ఫలితం
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం,జూన్1(ఆంధ్రజ్యోతి) : ఓట్ల లెక్కింపు ఎల్లుండి మంగళవారం ఉదయం 8 గంటల నుంచే ఆరంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎస్.తేజ్‌భరత్, డీఆర్వో నరసింహులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్లను ఒకేసారి సమాంతరంగా లెక్కిస్తారని, ప్రతి రౌండ్ పూర్తికాగానే, వాటి వివరాలు మీడియాకు అందిస్తామన్నారు. నన్నయ వర్సిటీలోని కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించే సిబ్బందికి ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డులు జారీ చేసిందన్నారు. కేంద్రంలోకి ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ఒక ఏజెంట్ ఒకసారి లోపలకు వచ్చి తిరిగి బయటకు వెళితే తిరిగి అనుమతించమన్నారు. నియోజకవర్గాల వారీగా కలర్‌కోడ్‌ను గుర్తింపుగా ఇచ్చామన్నారు. ఇతరులకు ప్రవేశం లేదన్నారు.కౌంటింగ్ ఏజెంట్లు వారికి కేటాయించిన నియోజకవర్గం కౌంటింగ్ హాల్ నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకూ బయటకు వెళ్లే వీలులేదన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 98 టేబుళ్లు, మొత్తం 116 రౌండ్లు, అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 98 టేబుళ్లు, 116 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపునకు సహాయ రిటర్నింగ్ అధికారులు ఏడుగురు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు 119 మంది, సహాయకులు 126, సూక్ష్మ పరిశీలకులు 140, ఇతర సిబ్బంది 119 వంతున నియమించినట్టు చెప్పారు. మొత్తం 2500 మంది కౌంటింగ్ సిబ్బంది ఉంటారన్నారు. మొత్తం 17 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఇందులో 7 అసెంబ్లీ, 7 సెంటర్లలో పార్లమెంట్, 3 సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారన్నారు. రాజమండ్రి సిటీ, రూరల్‌లో ఎక్కువ పోస్టల్ బ్యాలెట్లు ఉన్నందున ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, అనంతరం ఈవీఎం ఓట్లు లెక్కిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఒక రౌండ్‌లో లెక్కించడానికి 3గంటలు సమయం పడుతుందన్నారు. కొవ్వూరు ఫలితం మధ్యాహ్నం 12.40 గంటలకు, రాజమండ్రి రూరల్ ఫలితం 2 గంటలకు ప్రకటించే విధంగా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. మీడియాను మీడియాసెంటర్ వరకే అనుమతి ఇస్తామని అక్కడ వరకూ సెల్‌ఫోన్లు తెచ్చుకోవచ్చన్నారు. కౌంటింగ్ హాల్‌లోకి ఎవరూ ఫోన్‌లు తీసుకు రాకూడదని..ముందుగానే అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్‌లో డిపాజిట్ చేయాలన్నారు. మొత్తం లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటలకు పూర్తవుతుందని తెలిపారు. కానీ గెలిచిన వారికి వీవీప్యాట్స్ ఓట్ల లెక్కింపు, సర్టిఫికెట్లు ఇవ్వడం వంటి మొత్తం ప్రక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసేలా కార్యాచరణ చేశామన్నారు.ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు తెల్లవారుజాము నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామన్నారు. కౌంటింగ్ సెంటర్‌కు 2 కిలోమీటర్ల పరిధి వరకూ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. 130 సీసీ కెమెరాలు, 10 డ్రోన్ల పర్యవేక్షణ ఉందని చెప్పారు. జిల్లాలో 160 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలకు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. అభ్యర్థుల ఇళ్ల వద్దకు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఏ నియోజకవర్గం లెక్కింపు ఎక్కడంటే..

రూట్ మ్యాప్ సిద్ధం చేసిన అధికారులు



దివాన్‌చెరువు, జూన్ 1 : లెక్కింపు ఎక్కడ జరుగుతుంది.. ఎలా వెళ్లాలి .. ఏ భవనంలో జరుగుతుందనే దానిపై ఒక రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం సమీపంలో లెక్కింపు కేంద్రాల సమాచారంతో రూపొందించిన పెద్ద స్కెచ్ బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. అందులో నియోజకవర్గాల పేర్లు, లెక్కింపు జరిగే భవనం తదితర సమాచారం పొందు పరచారు. నిడదవోలు నియోజకవర్గం ఓట్లు లెక్కింపు ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం గ్రౌండ్‌ఫ్లోర్, గోపాలపురం నియోజకవర్గం ఓట్లులెక్కింపు ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం మొదటిఫ్లోర్‌లోనూ జరుగుతాయని పేర్కొన్నారు. రాజానగరం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఇంజనీరింగ్ వర్క్‌షాప్ ల్యాబ్స్, ఎస్.బ్లాకులో రాజమహేంద్రవరం రూరల్,అనపర్తి, కొవ్వూరు, రాజమండ్రిఅర్బన్ నియోజకవర్గాల ఓట్లు లెక్కిస్తారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పరిపాలనా భవనం రెండో ఫ్లోర్‌లో లెక్కిస్తారు. పరిపాలనా భవనానికి ఎదురుగా గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కేంద్ర గ్రంథాలయంలో మీడియా సెంటర్ , కమాండ్ కంట్రోల్‌రూమ్‌లు పనిచేస్తాయని పేర్కొన్నారు.

డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ పద్మశ్రీ రాణి



రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 1 : జిల్లా వైద్యసేవల సమన్వయాధికారిణి (డీసీహెచ్ఎస్)గా నియమితులైన డాక్టర్ ఎన్‌పీ పద్మశ్రీ రాణి శనివారం కలెక్టర్ మాధవీలతను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇప్పటి వరకూ డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన సనత్‌కుమారి పదవీవిరమణ చేయడంతో పద్మశ్రీ రాణిని ఎఫ్ఏసీగా నియమించారు. డాక్టర్ పద్మశ్రీ రాణి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి జిల్లాకు బదిలీపై వచ్చారు. అంతకుముందు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోనూ పద్మశ్రీ రాణి విధులు నిర్వర్తించారు.

కాలువలకు నీరు విడుదల



గోదావరి నుంచి శనివారం ఉదయం కాలువలకు సాగు నీటిని విడుదల చేశారు. ఈ మేరకు కలెక్టర్ మాధవీలత గోదావరికి చీర, పసుపు కుంకుమ వేసి పూజలు చేశారు. - వివరాలు 8లో


రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీగా
నాగ నరసింహారావు బాధ్యతలు


బాధ్యతలు స్వీకరించిన నాగ నరసింహారావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 1 : రాజమహేంద్రవరం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్‌గా సీహెచ్.నాగ నరసింహారావు నియమితులయ్యారు. మునిసిపల్ ఆర్‌డీగా పనిచేసిన నాగళ్ళ వీరవెంకట సత్యనారాయణ పదవీ విరమణ కావడంతో ఆయన స్థానంలో కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్.నాగనరసింహరావునును ఆర్‌డీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 1999 గ్రూప్-2 బ్యాచ్‌కు చెందిన నాగ నరసింహారావు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో భీమవరం, పాలకొల్లు, కొవ్వూరు, నరసాపురం మునిసిపాలిటీలకు కమిషనర్‌గా సేవలందించారు. కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆర్‌డీ నాగనరసింహరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీగా అంకితభావంతో సేవలందిస్తానన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల పరిధిలో 34 మునిసిపాలిటీలు తన పరిధిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా పలు మునిసిపాలిటీలకు చెందిన కమిషనర్లు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఈనెలాఖరు వరకు
విజయవాడ వరకే గుంటూరు ఫాస్ట్

నరసాపురం, జూన్ 1: నరసాపురం-గుంటూరు మధ్య నడిచే 17282 ఫాస్ట్ ప్యాసింజర్ శనివారం పునరుద్ధరించారు. ఈ రైలు ఈనెల 30 వరకు విజయవాడ వరకు నడవనుంది. గుంటూరు డివిజన్‌లో ట్రాక్ పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు. నరసాపురంలో ఉదయం ఆరు గంటలకు బయలుదేరే రైలు తిరుగు ప్రయాణంలో విజయవాడలో సాయంత్రం 6.50 గంటలకు బయలుదేరనుంది.



ఇంటింటా జల్లెడ

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో తనిఖీలు ముమ్మరం

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గ్రామ గ్రామాన వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. మరో రెండు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉండటం, ఇటీవల జిల్లాలో దొంగతనాలు పెరగడంతో పోలీసులు తనిఖీలను అధికం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో రహదారులపై వాహనాలను ఆపి తనిఖీలు చేయడమే కాకుండా ఇంటింటా జల్లెడ పడుతున్నారు.

\- పాలకొల్లు

కౌంటింగ్ సందర్భంగా కార్డన్ సెర్చ్‌లు

- రికార్డులు లేని ద్విచక్రవాహనాలు స్వాధీనం
- లబోదిబోమంటున్న వాహనదారులు
- మామూళ్ల మత్తులో సిబ్బంది !
- పొలాల్లో దాచుకుంటున్న వాహనాలు


కైకలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ కృష్ణకుమార్, సిబ్బంది

ఇటీవల కాలంలో ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా చిల్లర దొంగతనాలు పెరిగిపోయాయి. గత రెండు నెలల వ్యవధిలోనే ఉమ్మడి పశ్చిమ జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో మోటారు సైకిళ్ళు, ఇళ్ల వద్ద నీటి మోటార్లను ఎత్తుకుపోయారు. రైతులు మకాంలో పెంచుకునే కోడి పెట్టలు, పుంజులను ఎత్తుకుపోతున్నారు. సాధారణంగా ప్రతీ ఏటా వేసవిలో చిల్లర దొంగతనాలు పెరుగుతాయి. ఈ ఏడాది చిల్లల దొంగలు మరింతగా రెచ్చిపోయారు. ఎన్నికలు కూడా రావడంతో ఆవారా జనం సంఖ్య మరింత పెరిగిపోయి. మద్యం వంటి వ్యసనాలకు సొమ్ములు లేక దొంగతనాలకు పాల్పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పెద్దగా అల్లర్లు లేనప్పటికీ, పల్నాడు ఇంకా పలు ప్రాంతాల్లో రాజకీయపార్టీ శ్రేణులు అల్లర్లకు పాల్పడడంతో పోలీసులు ముందుస్తు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలో అనుమానం ఉన్న ప్రతీ ప్రాంతంలోనూ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఓ ఇంటిలో ద్విచక్రవాహనం ఉంటే సంబంధిత వాహనాల రికార్డులను పరిశీలిస్తున్నారు. సీ-బుక్, నంబర్ ప్లేట్లు లేకుంటే వాహనాలను పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి తమ కూడా ఒక ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని ఉంచుకుంటున్నారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పోలీసు స్టేషన్లకు తరలిస్తున్నారు. అనంతరం సంబంధిత వాహనానికి యజమాని రికార్డులు చూపిస్తే వాహనాన్ని తిరిగి ఇస్తున్నారు. పెట్రో బాంబుల్లాంటివి తయారు చేయకుండా ఇప్పటికే పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ చిల్లర విక్రయాలు నిషేధించారు. గుర్తుతెలియని ద్విచక్రవాహనాలను ఉపయోగించుకుని అసాంఘిక కార్యక్రమాలు, అల్లర్లకు పాల్పడే అవకాశాలు ఉండడంతో ముందస్తుగా వాహనాల తనిఖీలు చేపట్టారు.

ఆందోళనలో వాహనదారులు

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు వినియోగించే వారు వాహన రికార్డులపై పెద్దగా దృష్టి సారించరు. ఏళ్ళ తరబడి బైక్‌కు ఇన్సూరెన్సు లేకున్నా రెన్యువల్ చేయించరు. అధికశాతం వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సులు ఉండవు. ఈ పరిస్థితుల్లో పోలీసులు ఇంటింటికీ తిరిగి వాహనాలపై ఆరా తీస్తుండడంతో ద్విచక్రవాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తాము ఫలానా వ్యక్తి వద్ద వాహనం కొనుగోలుచేశామని, సీ-బుక్ ఇంకా తీసుకోలేదని కొంతమంది చెప్పినప్పటికీ ఆ వాహనానికి రికార్డులు లేకపోవడంతో పోలీసులు వాహనాలను స్టేషన్లకు తరలిస్తున్నారు.

నాలుగో తేదీ వరకు తనిఖీలే

ఎన్నికల ఫలితాల కౌంటింగ్ ప్రక్రియ ఈనెల 4వ తేదీన ఉండటంతో మరో రెండు రోజులు తనిఖీలు ఇదేవిధంగా ఉంటాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు. తనిఖీలతో పౌరులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. రికార్డులు సరిగా చూపించలేని సందర్భంలో ఆయా వాహనాలను పోలీసు స్టేసన్‌కు తరలించినప్పటికీ రికార్డులు చూపితే వెంటనే వాహనాన్ని ఇస్తున్నామని చెబుతున్నారు.

పొలాల్లో దాచేస్తున్నారు..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గత వారం రోజులుగా తనిఖీలను ముమ్మరం చేయడంతో వాహనదారులు కొంతమంది తమ బైక్‌లను కూడా పోలీసులు తీసుకు వెళతారనే భయంతో పొలాల్లో దాచుకుంటున్నారు. తగినంత అవగాహన లేకపోవడం పోలీసులు ఎంచేస్తారోనన్న భయాందోళనలతో పెద్దగా చదువుకోని వాహన దారులు ఆందోళన చెందుతున్నారు.

సందిట్లో సడేమియా

తనిఖీల పేరుతో జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో కిందిస్థాయి సిబ్బంది మామూళ్ళు వసూళ్ళు చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనదారుడు అమాయకంగా కనిపిస్తే ఏదో ఒక కారణం చూపించి సొమ్ములు లాగుతున్నారని విమర్శలు వినిపిస్తున్నారు.

డ్రైవింగ్ లైసెన్సులపై శ్రద్ధపెట్టాలి

పోలీసులు ఇంటింటికి తిరిగి ద్విచక్రవాహనాలకు రికార్డులు ఉన్నది లేనిది తనిఖీలు చేస్తున్నట్టుగానే సంబంధిత వాహనదారుకు డ్రైవింగ్ లైసెన్సు ఉందో లేదోనని పరిశీలించాలని పలువురు పరిశీలకులు సూచిస్తున్నారు. వాహన దారులు అందరికీ డ్రైవింగ్‌పై (లైసెన్సు) అవగాహన కల్పించి లైసెన్సులు ఇస్తే రహదారులపై ప్రమాదాలు తగ్గుతాయని, పోలీసులు రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులు దృష్టి పెట్టాలని పలువురు పరిశీలకులు సూచిస్తున్నారు.

అల్లర్లకు పాల్పడితే జైలుకే: ఎస్పీ



ఏలూరు క్రైం, జూన్ 1 : ఎగ్జిట్ పోల్స్ పేరుతో ప్రజలు వివాదాలు, అల్లర్లకు పాల్పడితే జైలుకే అని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు ఎగ్జిట్ పోల్స్, కౌంటింగ్ దృష్ట్యా గ్రామాల్లో వివాదాలు అల్లరి లేకుండా శాంతియుతంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు జిల్లాలో పలు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ గ్రామాల్లో శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎవరైనా సమావేశాలు అనుమతి లేకుండా పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ 4న నిర్వహించనున్న దృష్ట్యా పోలీస్ యాక్ట్ 30, సీఆర్పీసీ 144 సెక్షన్ అమలులో ఉన్నాయని అన్నారు. కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి నడుచు కోవాలని సూచించారు. ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లర్లకు పాల్పడితే వారి సమాచారం 122కు గాని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు గాని తెలియజేయాలన్నారు.

ముద్దాయిలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం

▸ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్


భీమవరం స్పెషల్ జైల్‌ను సందర్శించిన పురుషోత్తమకుమార్

భీమవరం క్రైం/నరసాపురం టౌన్, జూన్ 1 : న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమతలేని ముద్దాయిలకు మండల సేవాసంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తమ కుమార్ అన్నారు. శనివారం భీమవరం, నరసాపురం స్పెషల్ సబ్ జైళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెయిల్, ష్యూరిటీ వివరాలను సంబంధిత కోర్టు న్యాయమూర్తిని, ముద్దాయి తరుపు న్యాయవాదిని వాకబు చేస్తారు, కేసు విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం జైళ్ల పరిసరాలను, ముద్దాయి బ్యారక్‌లను, వంటశాలను, స్టోర్ రూమ్, ఆఫీస్ రూమ్‌లను పరిశీలించారు. ముద్దాయిలకు అందుతున్న భోజన వసతులు, డాక్టర్ విజిట్ విషయాలను జైలు సూపరింటెండెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు, ఒకటో అదనపు సివిల్ జడ్జి పి.మనీషా, రెండో అదనపు సివిల్ జడ్జి డి.ధనరాజు, జైలు సూపరింటెండెంట్ డి. వెంకటగిరి, ఉచిత న్యాయవాదులు, సివిల్ జడ్జి వరలక్ష్మి, ఆదనపు సివిల్ జడ్జి శ్రీనివాస్, జైలర్ అప్పారావు, బార్ అసోసియేషన్ సభ్యులు దానయ్యనాయుడు, ఆర్‌జీ కుమార్, పద్మజ తదితరులు ఉన్నారు.

మృతుడి
ఆచూకీ లభ్యం

ఏలూరు క్రైం, జూన్ 1 : మృతుడి ఆచూకీ లభ్యమైంది. శుక్రవారం నగర శివారు ఆశ్రం ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి పక్కన పడి ఉన్న మృతి చెందిన వ్యక్తిని సిద్ధార్థ(30)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సిద్ధార్థ కొంతకాలంగా రాజమహేంద్రవరంలో ఉంటూ ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. రెండు రోజుల క్రితం ఇంటికి వెళతానని బేకరీ నిర్వాహకులకు చెప్పి కర్ణాటకకు బయలుదేరిన వ్యక్తి ఆశ్రం ఆసుపత్రి సమీపంలో మృతి చెందాడు. ఏదైనా అనారోగ్యానికి గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. రూరల్ ఎస్‌ఐ రాజారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీవారి దర్శనానికి క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీవారి సన్నిధిలో భక్తుల కళకళ

ద్వారకాతిరుమల, జూన్ 1: గోవింద నామాలతో చిన్నతిరుమలేశుని క్షేత్రం మార్మోగింది. స్వామికి ఇష్టమైన రోజు కావడంతో శనివారం ఆలయానికి భక్తుల రాకతో కళకళలాడింది. ఆలయానికి దాదాపు 20 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు అంచనా. ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి మూడు గంటల పైబడి సమయం పట్టింది.

నేడు చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 1: రాజమహేంద్రవరంలోని కాల్ ఫ్యూజన్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు ఆదివారం అంతర్గత చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అకాడమీ డైరెక్టర్ కుమార్ విత్తనాల ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 8గంటలకు హాజరుకావొచ్చన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 1: ది రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఛాంబర్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, గౌరవ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు ఖాయిదా కొట్లు వీధిలోని ఛాంబర్ భవనంలో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ కంటి వైద్యులు, గుండె వైద్యులు, పలు విభాగాల సర్జరీ వైద్యులు, గైనకాలజీ వైద్యులు పాల్గొంటారన్నారు. వ్యాపార సంస్థల్లో పనివారు, జట్టు కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కాలువలకు జల కళొచ్చింది..

- గోదావరి డెల్టా కాలువలకు నీరు విడుదల
- 3 కాలువలకు 3 వేల క్యూసెక్కులు
- ధవళేశ్వరం బ్యారేజీపై కలెక్టర్ పూజలు

ధవళేశ్వరం, జూన్ 1: రైతులు సకాలంలో నాట్లు పూర్తి చేసుకుంటే పంట ప్రకృతి విపత్తుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అందుకే జూన్1న సాగునీటిని విడుదల చేస్తున్నామని కలెక్టర్ మాధవీలత అన్నారు. గోదావరి డెల్టా పరిధిలోని మూడు ప్రధాన పంట కాల్వలకు శనివారం సాగునీరు విడుదల చేశారు. ఉదయం తూర్పుడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద ఆమె గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూజులు సమర్పించారు. స్లూయిజ్‌గేట్లు ఎత్తి మోటార్ స్విచ్‌ను ఆన్‌చేసి తూర్పుడెల్టా కాలువకు నీటిని విడుదల చేశారు. తదుపరి గోదావరి డెల్టా సీఈ ఆర్.సతీష్‌కుమార్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు మిగిలిన 3 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు మధ్యడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద పూజలు నిర్వహించి కాలువకు సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఈస్ట్రన్ డివిజన్ ఈఈ కె.రామకృష్ణ, డీఈ ఇ.రమేష్, ఏఈఈ కె.నాగలక్ష్మి, ఏఈలు అద్దంకి సాయిరాం, ఆర్.సునీల్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాలువలకు నీరు విడుదల

నిడదవోలు, జూన్ 1: నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద శనివారం పశ్చిమ డెల్టా కాలువలకు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎమ్.దక్షిణామూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. కాలువలు కట్టేసిన అనంతరం తిరిగి పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదల చేసిన సందర్భంగా విజ్జేశ్వరం బ్యారేజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరించారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి చీర, రవిక, గాజులు, పూలు, పళ్లు సమర్పించారు. అనంతరం హారతులిచ్చి ఈఈ దక్షిణామూర్తి బ్యారేజ్ వద్ద ఉన్న స్విచ్ ఆన్ చేసి పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిరోజు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, తర్వాత అవసరానికి తగినట్టుగా పెంచుతామన్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని రైతాంగం సార్వాను త్వరగా ప్రారంభించుకోవడం ద్వారా దాళ్వా కూడా త్వరగా ప్రారంభమవుతుందన్నారు. ముందుగానే నీటిని విడుదల చేస్తున్నందున రైతాంగం ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శెట్టిపేట జేఈ కిరణ్‌కుమార్, నీటి పారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కార్యక్రమంలో ఎక్కడా రాజకీయ నాయకులు లేకపోవడంతో కార్యక్రమమంతా అధికారుల చేతుల మీదుగా సాగింది.



విజ్జేశ్వరంలో స్విచ్చాన్ చేస్తున్న ఈఈ దక్షిణామూర్తి



ధవళేశ్వరంలో గేట్ల నుంచి పొంగుకొస్తున్న నీరు



ధవళేశ్వరంలో స్విచ్చాన్ చేస్తున్న కలెక్టర్ మాధవీలత

హనుమజ్జయంతి వేడుకలు

- ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తమలపాకులతో అర్చనలు, సింధూర అభిషేకాలు
- పలుచోట్ల హనుమాన్ చాలీసా పారాయణం



కొవ్వూరులో పూజల్లో పాల్గొన్న భక్తులు

కొవ్వూరు, జూన్ 1: హనుమత్ జయంతి వేడుకలను శనివారం పలుచోట్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. కొవ్వూరు మండలం పశివేదల పాటిచెరువు వద్ద శ్రీఅభయాంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి సిందూరం, తమలపాకులతో అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయం, మెరకవీధి, బసివిరెడ్డిపేట, రైల్వేస్టేషన్ వద్ద, సుందర గోవిందుని ఆలయంలో, టాక్సీస్టాండ్ వద్ద ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు.

పవన్‌కల్యాణ్ గెలవాలని పూజలు

సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం నుంచి కొణిదెల పవన్‌కళ్యాణ్, రాష్ట్రంలో జనసేన అభ్యర్థులు విజయం సాధించాలని కొవ్వూరులో ఆంజనేయస్వామికి పూజలు చేశారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ వద్ద భక్తాంజనేయస్వామి ఆలయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, మేనేజర్ పోలిశెట్టి శివ పూజలు నిర్వహించారు.

పెరవలి: పెరవలిలో అభయాంజనేయస్వామి లక్ష తమలపాకు, గంధ సిందూరం పూజ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రావులపాలేనికి చెందిన ఆకుల వెంకటేశ్వరరావు దంపతులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు, కోలాటం ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు పాల్గొన్నారు. అన్నవరప్పాడులో పరుశురాముడి ఆలయ సన్నిధిలోని అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానూరు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, తదితర గ్రామాల్లో కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఖండవల్లిలో అభయాంజనేయస్వామి ఉత్సవాల్లో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. వీరికి వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికారు. భూపతిరాజు రవివర్మ, అతికాల శ్రీను పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. మోర్త, దమ్మెన్ను, వేలివెన్ను, కాల్ధరి, సూర్యారావుపాలెం, పసలపూడి, పాలంగి, కె.సావరం, చివటం, వెలగదుర్రు, తాడిపర్రు గ్రామాల్లో ఆంజనేయస్వామికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నిడదవోలు: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయంలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రశశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.




ఉండ్రాజవరం: వెలగదుర్రులో పూజలందుకున్న ఆంజనేయస్వామి




పెరవలిలో పితాని, బూరుగుపల్లి, దుర్గేష్‌కు వేద మంత్రాలతో ఆశీర్వచనం పలుకుతున్న పండితులు



నిడదవోలు : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆంజనేయస్వామికి పూజలు







సీహెచ్‌వో అప్పారావుకు ఘన వీడ్కోలు

దేవరపల్లి, జూన్ 1: దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వోగా పనిచేస్తున్న ఎంవీవీ.అప్పారావు పదవీ విరమణ సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో ఆయనను డాక్టర్ సాంబశివరావు, సంజీవకుమార్, రామారావు సన్మానించారు. వైద్యరంగంలో 35ఏళ్లుగా సుదీర్ఘ సేవలందించి అందరి మన్ననలు పొందారన్నారు. అప్పారావు మాట్లాడుతూ అందరి సహకారంతో వివిధ హోదాల్లో సుదీర్ఘ సేవలందించానన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చిబాబుకు ద్విసభ్య కమిటీ పరామర్శ



కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

కొవ్వూరు, జూన్ 1: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త పెండ్యాల వెంకటకృష్ణారావు(కృష్ణబాబు) మృతి నేపథ్యంలో ఆయన సోదరుడు ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్చిబాబుతో పాటు అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణను పలువురు శనివారం దొమ్మేరులో పరామర్శించారు. కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సినీ నిర్మాత బోగవల్లి ప్రసాద్, అల్లూరి విక్రమాదిత్య, ఇమ్మణి వీరశంకరం, కేవీకే రంగారావు, గన్నిన సత్తిబాబు, డిస్ట్రిక్ మార్కెటింగ్ సొసైటీ మాజీ ఛైర్మన్ దొరబాబు, గారపాటి రామకృష్ణ, కలగర సుబ్బారావు, మురమళ్ల సత్యనారాయణ, వాడవెల్లి నాగేశ్వరరావు, గంగుమళ్ళ స్వామి, బెల్లపుకొండ వెంకట రామారావు, యలమర్తి రాంబాబు, జుజ్జవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడిలో ఒకరి అరెస్టు

దేవరపల్లి, జూన్ 1: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కేవీ.స్వామి తెలిపారు. గోపాలపురం మండలం వెంకటాయిపాలెం గ్రామంలో 10లీటర్ల సారాతో ఒకరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

మా అభ్యర్థుల విజయం ఖాయం


కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు


కొవ్వూరు, జూన్ 1: రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు గెలవబోతున్నారని, వైసీపీ ఓటమి పాలవుతుందని అన్ని సర్వేలు చెబుతున్నాయని నియోజకవర్గ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, వైసీపీ నాయకులు రాష్ట్రంలో అలజడి సృష్టించాలని, శాంతి భద్రతల సమస్యలు తీసుకురావాలన్నట్టుగా సజ్జల వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. టీడీపీ జనసేన నాయకులను ఎదుర్కొనే వారే, గొడవ పడే వారే కౌంటింగ్‌కు రావాలని మాట్లాడడం దురదుష్టకరమన్నారు. ఆ వ్యాఖ్యలను కూటమి నాయకులు ఖండిస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా కూటమి శ్రేణుల సంయమనం పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి పని చేయాలని ముప్పిడి అన్నారు.

అల్లర్లు, గొడవలు చేస్తే జైలుకే

కొవ్వూరు రూరల్ ఎస్ఐ సుధాకర్

కొవ్వూరు, జూన్ 1: కౌంటింగ్ సమయంలో ఎటువంటి అల్లరు, గొడవలు చేసినా అరెస్టుచేసి జైలుకు పంపిస్తామని ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఎన్నికల నిబంధనలపై శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని సీంపేట, మద్దూరులంక వద్ద విజ్జేశ్వరం బ్యారేజ్ దిగువన గోదావరిలో స్నానాలు చేయడానికి వచ్చిన యాత్రికులకు నది ప్రమాదకరంగా ఉందని, నదిలో ఎవ్వరూ దిగవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. బ్యారేజ్ పరిసరాల్లో ప్రజలు నదిలో దిగకుండా అన్ని మార్గాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు నదిలో ఎవ్వరూ దిగకుండా ముళ్ల కంపలు వేశారు. మద్దూరు గ్రామంలో యువకులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై మక్కువ కనబర్చాలని వాలీబాల్ నెట్‌ని బహూకరించారు. మంచి అలవాట్లతో చదువులో రాణించాలని సూచించారు.









విదమ్మతల్లికి కుంకుమ పూజలు

దేవరపల్లి, జూన్ 1: దేవరపల్లిలో బల్లల పండుగలో భాగంగా శనివారం విదమ్మతల్లి ఆలయం వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో గరగ నృత్యాలతో, వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో ఊరేగించారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు సత్యనారాయణ, కడెల్లి సుబ్బయ్య, లింగాల భద్రయ్య, కొంజర్ల శ్రీను, సుబ్బారావు, కొంజర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పురవీధుల్లో విదమ్మ తల్లి ఊరేగింపు